
పెద్దకథ:

# అమ్మ



"అనసూయ కొడుకుని ఉయ్యాల్లో వేస్తున్నారట. పేరంటం పిలిచి వెళ్ళారు. వెళ్ళొస్తాను." వత్తులు చేసుకుంటున్న అత్తగారి దగ్గరకు వెళ్ళి చెప్పింది రుక్మిణి.

"ఏ అనసూయా? క్రిందటేడు పెళ్ళయిన అనసూయేనా? అప్పుడే బిడ్డనెత్తుకున్నదన్న మాట?" ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఏడాది క్రిందటే పెళ్ళయింది." తల వంచుకొని చెప్పింది రుక్మిణి.

"ఊఁ" దీర్ఘంగా నిట్టూర్చింది భారతమ్మ.

ఆ నిట్టూర్పు "నీకూ పెళ్ళయి నాలుగేళ్ళయింది. నీ జీవితంలో ఏ మార్పూ లేదు!" అన్నట్లు ధ్వనించింది రుక్మిణికి.

"వెళ్ళిరా! మనకు లేకపోతే లేకపోయింది. ఎదుటివాళ్ళను చూసైనా సంతోషించాలి. అక్కడ కాయపుండ పెడితే తిను. మానెయ్యకు. అది తింటే నెల తప్పుతుందంటారు. మన అదృష్టమెలా వున్నదో?" ఆవిడ తలొంచుకొని వత్తి నలప సాగింది.


నీరసంగా అనసూయ ఇంటివేపు అడుగు వేసింది రుక్మిణి.

బయల్దేరినప్పటి ఉత్సాహం ఇప్పుడు పూర్తిగా మటుమాయమయింది.

బాధపడతారని తెలిసి కూడా బాధపెట్టటం మనుషులకు అలవాటయిన జబ్బు.

అసలు ఈ పేరంటానికి వెళ్ళకూడదనే అనుకుంది రుక్మిణి. కాని చిన్నప్పటి స్నేహితురాల్ని

ఉండవల్లి జయశ్రీ


PRABAKAR

చూడాలనీ, ఆ పసివాడిని ఒకసారైనా ఎత్తుకో వాలనీ బయల్దేరింది.

ఇప్పుడు అక్కడకు వెళ్ళగానే.... 'ఏమ్మా, పెళ్ళయి ఎన్నేళ్ళయింది? పిల్లలెంత మంది? అయ్యో ఇంకా పుట్టలేదా? ఆపరేషన్ చేయించు కోక పోయావా? మీ ఆయన్ని డాక్టరు పరీక్ష చేయించుకోమను....' ఇలా ఒక ప్రశ్న తర్వాత ఒకటి అడిగి, ఉచిత సలహాలు ఒకటో రెండో చెప్పి ఉత్సాహాన్నంతా హరించేస్తారు.

ఆలోచిస్తే ఇది వాళ్ళ తప్పుకాదేమో అనిపిస్తుంది.

ఈ కాలంలో పెళ్ళయి మూడేళ్ళయితే.... ఇద్దరు పిల్లలు పుట్టుకు వస్తున్నారు.

అందరికీ అదే అనుభవం జరుగుతుంటే నూటికి ఏ ఇద్దరికో ముగ్గురికో ఆలస్యం కావటం ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది మరి.

ఇంకో ఆరు నెలలు అయితే అయిదో ఏడు కూడా వస్తుంది. అత్తగారు అందుకే దిగులు పడుతున్నదనుకుంది రుక్మిణి.

భారతమ్మకంటె రామచంద్రయ్యగారి తొందర ఎక్కువయింది. "అమ్మాయి నీళ్ళుపోసుకున్న దేమిటే?" అని భార్యని అడుగుతుంటారు.

"మీరు నెలకోసారి అడుగుతూ వుండండి. ఆవిడగారు ఇరవై రోజుల కొకసారి నీళ్ళు పోసుకుంటుంది!" విసురుగా వస్తుంది ఆవిడ సమాధానం.

"ఆహాఁ! అందుక్కాదు....పిల్ల చిక్కిపోతుం టేనూ...." నెమ్మదిగా సర్ది చెప్తుంటారు ఆయన.

ఎంత వినకూడదనుకున్నా ఇలాంటి మాటలు చెవిన పడుతూనే వుంటాయి.

తహతహలాడిపోతున్న ఆ ముసలి దంపతు లకు "ఇదుగోండి మీ మనవడు!" అని చూపించలేని తన అశక్తతకు కుమిలిపోతున్నది రుక్మిణి.

రుక్మిణిని చూసి వాకిట్లోకి పరుగున వచ్చింది అనసూయ. అభిమానంగా ఆమె చెయ్యి పట్టుకొని లోపలకు తీసుకెళ్ళింది.

"ఇదుగో నీకు అల్లుణ్ణి ఇచ్చేస్తున్నాను. ఇంక నీవు కూతుర్ని కనటమే తరువాయి!" హాస్యంగా అంటూ పిల్లవాడిని అందించబోయింది.

"ముందు ఏ పెద్ద ముత్తయిదువుకైనా ఇచ్చిన తరువాత ఆవిడ కివ్వచ్చులే!"

బాబుని ఎత్తుకుందామని ముందుకు వెళ్ళిన చేతులు, వెనక నుంచి ఎవరో అన్నమాటలలో క్రిందకు వాలిపోయాయి.

"అవును అనసూయా! ముందు పెద్దవాళ్ళ కెవరికైనా ఇవ్వు. నే వెళ్ళేటప్పుడు ఎత్తు కుంటాను." అనసూయ బాధపడకుండా నవ్వుతూ చెప్పింది రుక్మిణి.

ఆ మాటలకు రుక్మిణి నొచ్చుకుంటుందేమోనని భయపడింది. స్నేహితురాలి ముఖంలో నవ్వు చూడగానే తేలికపడింది అనసూయ మనసు.

కాని....తెచ్చిపెట్టుకున్న నవ్వు కలకాలం నిలుస్తుందా?

ఈ నిజాన్ని అనసూయ గ్రహించింది. పేరంటాళ్ళంతా వెళ్ళిపోయాక రుక్మిణి ఒళ్ళో పిల్లవాణ్ణి పడుకోబెట్టింది.

"బాగున్నాడు....అంతా నీ పోలికే!" బాబు అరికాళ్ళను మృదువుగా రాస్తూ అన్నది రుక్మిణి.

"డి అండ్ సి చేయించుకోకపోయావా?" నెమ్మదిగా అడిగింది అనసూయ.

"మొన్ననే డాక్టరు దగ్గరికి వెళ్ళాను. వచ్చే నెలలో రమ్మన్నారు." బాబు అరిచేతుల్తో ఆడుకుంటూ అన్నది రుక్మిణి.

"అది చేయించుకుంటే తప్పకుండా పుడతారు. మా ఆడబిడ్డకి మూడు నెలల క్రిందట చేశారు. ఇప్పుడు రెండో నెల!" రుక్మిణి దిగులుపడ కుండా ఇలాంటి ధైర్యం కలిగించే మాటలే చెప్పింది అనసూయ.

"ఎంత నిరాశలో వున్నవాళ్ళైనా నీ మాటలు వింటే జీవితం మీద ఉత్సాహం పెంచుకుంటారు అనసూయా! నాకలాగే అన్పిస్తున్నది."

ఇద్దరూ గుమ్మంలోకి వచ్చారు.

"ఇంక వెళ్ళొస్తాను. ఎనిమిదయింది. మావారొచ్చి వుంటారు. ఇంకా నేను రాలేదని మా అత్తగారు కంగారుపడుతుంటారు."

"అప్పుడప్పుడు వస్తూండు రుక్మిణీ! మావారొచ్చాక కబురు చేస్తాను. మీవార్ని కూడా తీసుకురా. పరిచయం చెయ్యచ్చు!" అన్నది అనసూయ.

అలాగేనని తలూపింది రుక్మిణి.

"ఇంకో సంగతి!" అనసూయ అందుకుంది.

ఏమిటన్నట్లు చూసింది రుక్మిణి.

"నీకు పెళ్ళయి నాలుగేళ్ళయినా నీ వయసు పాతికకి రాలేదు. ఇంకా చాలా భవిష్యత్తుంది. ఈ చిన్న ఆపరేషన్ చేయించుకున్నావంటే పిల్లలు తప్పకుండా పుడతారు. నువ్వు ఈ విషయమే ఆలోచిస్తూ, దిగులుపడుతూ ఆరోగ్యం పాడు చేసుకోకు!" రుక్మిణి భుజం మీద చెయ్యేసి ఆప్యాయంగా అన్నది అనసూయ.

"థ్యాంక్స్ అనసూయా! ఈ మాత్రం ధైర్యం చెప్పేవాళ్ళు ఈ వూళ్ళో నాకెవరూ కనిపించలేదు. నీ దగ్గరకు వచ్చాక నాకు చాలా బలం వచ్చినట్లు న్నది!" అనసూయ దగ్గర సెలవు తీసుకొని ఇంటికి బయల్దేరింది రుక్మిణి.

*

మధ్యదారిలో ఎదురయ్యాడు మాధవరావు.

"ఏం రుక్మిణీ! ఇంతాలస్యమయింది?" స్కూటర్ స్లో చేస్తూ అడిగాడు.

"అనసూయ ఏవో కబుర్లు చెబ్తూ కూర్చో పెట్టేసిందండీ! వాళ్ళాయన వచ్చాక మిమ్మల్ని తీసుకెళ్ళి పరిచయం చేస్తాను. వస్తారా!'

"వస్తాన్లే! త్వరగా ఎక్కు!"

దారి పొడుగునా అనసూయ గురించీ, ఆ పసి వాడి గురించీ చెబ్తూనే వున్నది రుక్మిణి.

"ముందు వెళ్ళి అన్నం తినిరా! తర్వాత చెప్పవచ్చు!" అని అత్తగారు అంటున్నా వినకుండా బాబుని గురించి చెప్పిన మాట చెప్పకుండా చెప్పింది. ఎంత చెప్పినా ఇంకా చెప్పాల్సిందేదో మిగిలిపోయినట్లుగా వున్నది రుక్మిణికి.

'స్నేహితురాలి కొడుకుని చూస్తే ఇంత సంబర పడుతున్నది పిచ్చిపిల్ల! ఇక తనకే పుడితే.... ఎంత ఆనందిస్తుందో?' అని అనుకోకుండా వుండ లేకపోయింది భారతమ్మ.

"ఏమండీ! అనసూయ కొడుకు ఎంత బాగున్నాడో! నాకయితే వాడిని మనింటికి తీసు కొద్దామనిపించింది." పక్క దులుపుతూ అన్నది రుక్మిణి.

"ఎంతమంది మీ అనసూయకి పిల్లలూ?"

"క్రిందటేడేగా పెళ్ళయింది. ఇదే మొదటి కాన్పు."

"ఏమిటి? ఫ్యామిలీప్లానింగూ ఏమీ లేకుండా ఏడాదికొకడిని కనేస్తుందేమిటి నీ ఫ్రెండ్?" తెచ్చి పెట్టుకున్న ఆశ్చర్యంతో అన్నాడు మాధవరావు.

"అది ఎంతమందినయినా కనచ్చు. వాళ్ళు చాలా ఆస్తిపరులు. ఇద్దరో, ముగ్గురో పుట్టగానే ఆపరేషన్ చేయించుకోవాల్సిన ఖర్మ దానికేం పట్టలేదు."

"అక్కడే పొరబడుతున్నావ్ రుక్మిణీదేవీ! ఆస్తి వుందని పదిమందిని కంటే వాళ్ళంతా పెరిగి పెద్దవాళ్ళయ్యేసరికి పైసా మిగలదు ఎవరికీ!"

"పరిమిత సంతానం – ప్రపంచ సౌభాగ్యం అని తెలియదా నీకూ నీ స్నేహితురాలికీ" కొంచం కోపంగా అన్నాడు అతను.

"మీరేమిటండీ ఫ్యామిలీ ప్లానింగు డాక్టర్ లాగా అంత సీరియస్ అయిపోతారు? అయినా పుట్టమంటే పుడ్తారా? వద్దంటే మానారా? మూడేళ్ళయింది–మనకు పుట్టారా?" బెడ్‌లైట్ వేస్తూ అన్నది.

"ఏదీ నువ్వు ఇంకా గట్టిగా అనుకోలేదు కదా! రుక్మిణీదేవి తలుచుకోవటమేమిటీ అది జరగక పోవట మేమిటీ? ఇప్పుడు అనుకున్నావనుకో! వెంటనే అమలు చేస్తావు" రుక్మిణిని దగ్గరకు తీసుకుంటూ అల్లరిగా నవ్వాడు మాధవ రావు. స్నేహితురాలి అభిమానంతో, భర్త అను రాగంతో కొన్నిరోజులు నిరుత్సాహాన్ని దగ్గరకు రానీయలేదు రుక్మిణి.

*

కాని....ఏనెలకానెల ఆశాభంగం పొందటం అత్తమామల ఆత్రం, చుట్టూ వున్న వాళ్ళ మాటలు–ఇవన్నీ కలిసి రుక్మిణి కూడబెట్టుకున్న బలాన్ని పీల్చేస్తున్నాయి. రోజు రోజుకీ చిక్కి పోతున్న రుక్మిణిని చూసి ఆందోళన చెందాడు మాధవరావు.

"ఏమిటి రుక్మిణీ! ఇలా అయిపోతున్నావు? సరిగ్గా అన్నం తింటున్నావా? డాక్టరు రాసిచ్చిన టానిక్కు తాగుతున్నావా?"

అన్నిటికీ సమాధానంగా తలూపింది రుక్మిణి.

"మీ వాళ్ళను చూడాలని వున్నదా?" భుజం మీద చెయ్యేసి ఆదరంగా అడిగాడు మాధవరావు.

"వచ్చేవారం ఆపరేషన్ గదా! మా అమ్మా తమ్ముడూ వస్తారుగా?" అతని ప్రశ్నకు జవాబుగా అన్నది. రుక్మిణి పుట్టిల్లు పల్లెటూరని అక్కడికి పంపించలేదు మాధవరావు.

"ఆపరేషన్ అంటే భయపడుతున్నావా?" కొంచెంసేపాగి అన్నాడు.

"భయమేమీ లేదు. చిన్న ఆపరేషనేగా!" ధైర్యంగా అన్నది.

"అందరిలాగా కాకుండా మనకివన్నీ వచ్చాయేమిటనే దిగులుగా వుంది." నెమ్మదిగా అన్నది.

"ఇది మరీ బాగుందోయ్! నీ ఒక్కదాని కోసమే ఇన్నీ హాస్పిటల్స్ కట్టారనుకున్నావా? మనలాంటి వాళ్ళు వందమంది...నీకో నిజం చెప్తాను విను...ఇప్పుడు ఆస్పత్రుల్లో రెండురకాల ఆపరేషన్లే ఎక్కువగా జరుగుతున్నాయట. ఒకటి పిల్లలు కావాలనీ, రెండోది పిల్లలు వద్దనీ!" మాధవరావు నవ్వులో శ్రుతి కలిపింది రుక్మిణి.

*

ఆపరేషన్ అయిపోయిన తర్వాత నీరసంగా పడుకున్న రుక్మిణిని చూసి బాధపడ్డాడు మాధవరావు.

"ఒంట్లో ఎలా వుందీ తేలికగా వుందా? హార్లిక్సు తాగుతావా? మీ అమ్మగారు వాకిట్లో కూర్చున్నారు. పిలవనా?" అన్నిటికి కలిసి వద్దని తల అడ్డంగా తిప్పింది.

"అమ్మ ఇందాక వచ్చి వెళ్ళింది. అప్పటికి నీకింకా స్పృహరాలేదు. ఆవిడ మనవడు వుట్టినట్లే సంతోషిస్తున్నది. నాన్నగారయితే మరీ! వచ్చే సంవత్సరం ఈ పాటికి పుడ్తాడు....ఏం పేరు పెట్టాలా అని ఆలోచిస్తున్నారు. వీళ్ళ ఆత్రం చూస్తే నాకు నవ్వొస్తున్నది....మా తాతగారు అనేవారట....'కొడుకు పుట్టగానే సరికాదు...కొడుక్కి కొడుకు పుట్టాలని' అందుకు – ఇప్పుడు నీవు మనవడ్ని ఇవ్వకపోతే....వాళ్ళు వూరుకొనేలా లేరు!" చిన్నగా నవ్వుతూ అన్నాడు మాధవరావు. 'ఇంతమంది తనమీద ఇన్నీ ఆశలు పెట్టుకున్నారు. తనింకా తల్లి కాలేదని అమ్మ ఏడుస్తున్నది. కాపరాలు స్థిరంగా వుండాలంటే పిల్లలుండాలని అమ్మ నమ్మకం. ఒకవేళ వీళ్ళు వూహించినట్లు త్వరగా రాకపోతే?'....ఝుల్లు మన్నది రుక్మిణి శరీరం.

"ఈ ఆపరేషన్ జయప్రదం అయి. నేను తప్పకుండా తల్లినయ్యేలా అనుగ్రహించు!" దేవుడిని మనసులోనే ప్రార్థించుకున్నది. ఆ రోజు అనసూయ వచ్చి కాసేపు కూర్చొని ధైర్యం చెప్పి వెళ్ళింది.

ఆపరేషన్ జరిగి ఆరునెలలయింది.

ఈ ఆరునెలలు భవిష్యత్తు మీద ఆశ పెంచుకుని బ్రతికింది రుక్మిణి.

భగవంతుడు మనుషులకిచ్చిన వరాల్లో 'ఆశ' ఒకటి కదా!

ఆ రోజు అనసూయ తమ్ముడు పరుగుపరుగున వచ్చి చెప్పాడు.

[45వ పేజీ చూడండి]

## వినతి

'వనిత'కు ప్రచురణ కోసమని కథలు, వ్యాసాలూ గేయాలూ మొదలైనవి పంపేవారు కొన్ని విషయాలను గుర్తుంచుకోవలసిందిగా కోరుతున్నాము. కథలు, వ్యాసాలూ సాధ్యమైనంత క్లుప్తంగా వుండాలి. పేజీకి ఒక్కవైపునే సిరాతో శుభ్రంగా, తెలిసేలా–రాయాలి. ప్రతి రచనపైనా, వారి పేరు, పూర్తి చిరునామా వుండాలి. అది ఏ రచన అయినాసరే, అది తమ సొంతం అని, దేనికీ అనుసరణ, మక్కీ కాదని, దీంతోపాటే ఇంకొక పత్రికకు కూడా పంపలేదనీ–హామీ పత్రం రాసి ఇవ్వాలి. ప్రతి రచనతోపాటు, తమ చిరునామా రాసివున్న కవరును స్టాంపులతో సహా జతచేసి, పంపితేగాని, సమాధానం ఇవ్వడానికిగాని, రచన తిప్పిపంపడానికిగాని వీలుండదు. రచనల పరిశీలనకు కనీసం మూడు మాసాలైనా వ్యవధి కావలసివుంటుంది. ఈలోగా, 'రచన ఏమైంది?' అని ఉత్తరాలు రాయడంవల్ల ప్రయోజనం వుండదు. (రచన ప్రచురింపబడే పక్షంలో, ముందుగానే రచయిత్రులకు తెలియజేయబడుతుంది) ఈ చిన్న విషయాలను గుర్తుంచుకుని, మాతో సహకరించవలసిందిగా రచయిత్రులను కోరుతున్నాము.

—వ. సం

[అమ్మ : 13వ పేజీ నుంచి]

"మా అక్క మిమ్మల్ని రమ్మన్నదండీ!"

"అనసూయా? ఎప్పుడొచ్చిందీ?" ఆశ్చర్యంగా అన్నది.

"రెండు రోజులయిందండీ! మిమ్మల్ని తప్పకుండా రమ్మన్నదండీ! వచ్చేటప్పుడు మీ చెట్టుకి మామిడి పిందెలేమైనావుంటే తీసుకురమ్మన్నదండీ!" వచ్చిన పని అయినట్లు తూనీగలా పరుగెత్తాడు.

"ఎవరూ వచ్చింది?" అత్తగారు అడిగింది.

"అనసూయ వచ్చిందిట. రామూ వచ్చి చెప్పాడు. వచ్చేటప్పుడు మామిడి పిందెలేమైనా వేస్తే పట్రమ్మందిట."

"ఏమిటీ మామిడి పిందెలా? ఏమన్నా విశేషముందేమిటీ మళ్ళీ?" ఆలోచనగా అన్నది ఆవిడ.

"ఏమో మరి!" ముభావంగా అని లోపలకు వెళ్ళింది రుక్మిణి.

*

"చెట్టంతా వెతికితే నాలుగు పిందెలు దొరికాయి. అవే తీసుకు వచ్చాను." అనసూయ చేతిలో పెడుతూ అన్నది రుక్మిణి.

"థ్యాంక్స్!" వెంటనే కొరుక్కుతింటూ అన్నది అనసూయ.

"ఏమిటి గుడ్‌న్యూసా?" అనుమానంగా అన్నది రుక్మిణి.

"న్యూసే! మూడో నెల!" పకపకా నవ్వుతూ అన్నది అనసూయ.

"అదృష్టవంతురాలివి." మనస్ఫూర్తిగా అన్నది రుక్మిణి.

"ఏమదృష్టం లెద్దూ .... వేవిళ్ళు ఎక్కువగా వున్నాయి. ఏది తిన్నా వాంతి అయిపోతున్నది. అందుకే అక్కడ వుండలేక ఇక్కడికి వచ్చేశాను.. అన్నట్లు....ఇంకో న్యూస్!"

"ఏమిటీ?" కుతూహలంగా అడిగింది.

"మా వారికి ఈ ఊరు ట్రాన్స్‌ఫరయ్యేలా వున్నదట. తెలియగానే ఉత్తరం వ్రాస్తానన్నారు. మనం మంచి ఇల్లు చూడాలి."

"చాలా మంచి వార్తలు చెప్పావు. త్వరగా తెలిస్తే బాగుండును–ప్రస్తుతం మా ఇంటి పక్క ఇల్లు ఖాళీగా వుంది. అందులోకి ఎవరూ రాకుండ మీరు వచ్చేయచ్చు" సంతోషంగా అన్నది రుక్మిణి.

"నీకేం విశేషం లేదుటే అమ్మాయ్?" అనసూయ బామ్మ లోపల్నించి వచ్చి అడిగింది.

"ఇప్పటివరకూ ఏమీ లేదండీ!" బాధను దాచుకుంటూ అన్నది రుక్మిణి.

"వద్దన్నవాళ్ళకు ఇస్తాడు ఆ దేవుడు. కావాలి మొర్రో అంటే వాళ్ళ మొర వినిపించుకోడు. మా అనసూయను చూడు. నీ ఈడుదేగా! అప్పుడే రెండోదానికి రెడీ!"

"బామ్మా! అమ్మ పిలుస్తున్నది ఎందుకో వెళ్ళి చూడు." బామ్మగారి వాక్ప్రవాహానికి ఆనకట్ట వేసింది అనసూయ.

"ఇప్పుడే వస్తానుండమ్మాయ్. మా అమ్మాయితో కబుర్లు చెబుతూ కూర్చో!" బామ్మగారు లోపలికి వెళ్ళిపోయింది.

కొంచెంసేపు కూర్చొని వచ్చేసింది రుక్మిణి.

"మనం అనుకున్నది నిజమేనా?" గుమ్మంలోనే అడిగింది భారతమ్మ.

"మూడోనెలట" నవ్వుతూ చెప్పింది.

"నవ్వేలా వస్తున్నది? తోటి పిల్ల అలా కంటుంటే సిగ్గనిపించటం లేదూ?"

తెల్లబోయింది రుక్మిణి.

"ఇది సిగ్గుపడితే జరిగేపనా?" మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"ఆరునెలలు బాలింత–ఆరునెలలు చూలింత అవుతారు కొంతమంది. ఇప్పుడు మరీ పిదపకాలం వచ్చేసింది. పసివాడికి ఆరో నెల....ఈవిడకప్పుడే మూడోనెలా? బాగుంది....వస్తే అలా... లేకపోతే ఇలా...." ఆ రోజంతా ఆవిడ రుక్మిణిని అనసూయతో పోల్చుకుంటూ బాధ పడుతూనే వున్నది.

రుక్మిణి దిగులుగా కనిపించినప్పుడల్లా మాధవరావు ధైర్యం చెబుతూనే వున్నాడు.

భవిష్యత్తు మీద ఆశ కలిగిస్తూనే వున్నాడు.

భగవంతుడి ముందు రుక్మిణి ఏకైక ప్రార్థన... 'అమ్మా!' అని పిలిపించుకునే అదృష్టాన్ని ప్రసాదించమనే!

*

మాధవరావు చెప్పినా వినకుండా,విసుక్కున్నా లెక్క చెయ్యకుండా ఉపవాసాలు, వ్రతాలూ, నోములూ, మొక్కులూ అన్నీ మొదలు పెట్టింది.

ఎవరో సుందరాకాండ పారాయణ చెయ్యటం మంచిదన్నారు. అదీ చేసింది. రుక్మిణి పూజలు ఫలించాయి అన్నట్లుగా ఆ నెల ఆశను పెంచి వెళ్ళింది.

ఇంట్లో అందరి ముఖాలు వికసించాయి.

రుక్మిణిని అపురూపంగా చూస్తున్నారు.

'వీళ్ళింత ఆర్భాటం చేస్తున్నారు .... నిజంగా ఇది నెల తప్పటమేనా?' ఆలోచనలో పడింది రుక్మిణి. వేవిళ్ళంటారూ వాంతులంటారు. అవేవీ కనిపించటం లేదు మరి!

అత్తగారితో చెబితే .... "నీ మొహం నీకు తెలియదులే! మొదటిసారి ఎవరికీ సరిగ్గా తెలియదు. అలాంటి అపశకునం మాటలు మాట్లాడకు. ఈ పళ్ళరసం తాగి పడుకో!" అని మందలించింది.

ఈ మంచి వార్త విన్నప్పటినుంచీ రుక్మిణి చేత ఒక్క పని చెయ్యనివ్వటం లేదు ఆవిడ.

"అంత పనీ మీరొక్కరే చేసుకుంటున్నారు!" అని రుక్మిణి నొచ్చుకుంది.

"నువ్వొక్కణ్ణి కనిచ్చేయి. ఆ తర్వాత నువ్వు చెయ్యమన్నా చెయ్యను. మనవణ్ణి పెట్టుకుని ఆడుకుంటూ కూర్చుంటాము మేము. మాకీ వయసులో కావల్సింది ఏముంది?" ఆవిడ ఖాళీ గ్లాసు తీసుకుని వెళ్ళిపోయింది.

తృప్తిగా నిద్రపోయింది రుక్మిణి.

నెలరోజులు ఉత్సాహంగా గడచిపోయాయి. రుక్మిణికి కొంచెం ఒళ్ళు చేసి బాగుంది. డాక్టరు దగ్గరికి వెళ్ళి పరీక్ష చేయించుకోవాలని ఒక ప్రక్క. ఆవిడేం చెబ్తుందో నని భయం వేరొక పక్క.. దానితో రుక్మిణి సందిగ్ధంలో పడింది.

ఆరోజు ఉదయం లేస్తూనే అనుకుంది రుక్మిణి. 'ఈ రోజుకి మూడో నెల' అని.

అందరూ అలాగే అనుకున్నారు. మాధవరావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. వెళ్ళబోతూ .... అలవాటు ప్రకారం అడిగాడు....'ఒంట్లో తేలిగ్గా వుందా?' అని.

ఉందని తలూపింది. అతను హుషారుగా ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు. ఈ రెండు నెలలనుంచీ భర్త ఉత్సాహంగా వుంటున్న విషయం పసిగట్టింది రుక్మిణి. అన్నం తిన్న కాసేపటికి కడుపునొప్పి మొదలయింది రుక్మిణికి.

పావుగంటకి అది భరించరానిదిగా మారిపోయింది.

అత్తగారి దగ్గరకు వెళ్ళి ఏడుస్తూ చెప్పింది. ఆవిడ కంగారు పడ్తూ పక్కింటావిడని పిలిచింది. వాళ్ళిద్దరూ కలసి కొంచెం దూరంగా వున్న నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్ళారు.

ఆ నర్సింగ్‌హోమ్ నుంచి మాధవరావుకు ఫోన్ చేశారు.

అతను వెంటనే బయల్దేరి వస్తున్నాడన్న తర్వాత కొంచెం స్తిమితపడ్డారు.

రుక్మిణిని పరీక్ష చెయ్యటానికి పిలిచింది లేడీ డాక్టరు.

అదిరే గుండెని చిక్కబట్టుకుని లేచి వెళ్ళింది రుక్మిణి.

ఆవిడ పెదవి విరిచేసింది. గుండెలో రాయి పడ్డది రుక్మిణికి. బలవంతాన దుఃఖాన్ని మింగుతూ తలవంచుకు కూర్చుంది.

"లోపల గడ్డగా పెరిగింది—అది ఆపరేషన్ చేసి తీసెయ్యాలి. ఈ పని ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. ఈ అమ్మాయి కూతురా?" భారతమ్మని అడిగింది డాక్టరు.

"కాదమ్మా! కోడలు. నాకు ఒక్కడే కొడుకు."

"పెళ్ళయి ఎన్నేళ్ళయిందీ?" రుక్మిణిని అడిగింది డాక్టరు.

"నాలు గేళ్లు దాటింది!" సమాధానం అత్తగారు చెప్పింది.

"ఇంతవరకూ నెల తప్పటం జరగలేదు."

"ఆపరేషన్ ఏదైనా చేయించారా?" మాట కద్దు వస్తూ అన్నది డాక్టరు.

"ఆఁ అన్నీ అయినాయి. అయిదారు నెలలు అయుంటుంది...అదేదో చిన్న ఆపరేషన్ చేశారు. ఏమిటీ దానిపేరు?" రుక్మిణిని ఆడిగింది ఆవిడ.

"డి అండ్‌సి." నెమ్మదిగా చెప్పింది రుక్మిణి.

"రిపోర్టు వుందమ్మా?" ఆవిడేవో మందులు రాసిస్తూనే అడిగింది.

"ఇంట్లో వుందండి. ఇప్పుడు తీసుకురాలేదు" తలవంచుకొనే అన్నది.

"నువ్వంతగా బాధపడాల్సింది ఏమీ లేదమ్మా! ఈ గడ్డ తీసేసి పీరియడ్స్ ఎలా వచ్చాయో చూసి కోర్సు మొదలు పెడదాము. డోంట్‌వర్రీ!" ఆవిడ ఇంక వెళ్ళచ్చు అన్నట్లుగా తలూపింది.

బయటికి వస్తుంటే మాధవరావు ఎదురయ్యాడు.

"డి అండ్ సి చేయించిన చోటుకి తీసుకెళ్ళక ఇక్కడికి తీసుకొచ్చారేమిటి? ఈ డాక్టరు ఏమన్నారు?" ఆదుర్దాగా అన్నాడు.

"ఆ డాక్టరు వూళ్ళోలేదట. మధ్యదారిలో నర్సు కనిపించి చెప్పింది. అప్పుడా రిక్షాని ఇటు తిప్పించాము. ఈవిడా బాగానే మాట్లాడిందిలే!"

"ఇంతకీ ఏమన్నదీ?" అసహసంగా అన్నాడు.

"ఇంటికి పద చెప్తాను!" అన్నది భారతమ్మ. మౌనంగా ఇంటిదారి పట్టారు.

ఊహిస్తున్న వార్తే డాక్టరు నోట్లోంచి కూడా వస్తే అమ్మ నవ్వుతూ చెప్పేదేగదా! రుక్మిణి ముఖం కూడా వాడిపోయింది. ఆ వార్త ఏమై వుంటుంది? అనుకుంటూ ఆలోచనల్లోనే ఇల్లు చేరాడు మాధవరావు.

ఇంట్లో అడుగుబెడ్తూనే అంతా చెప్పింది భారతమ్మ. "ఒరేయ్ మాధవా! మనం ఇన్నాళ్ళూ అనుకున్నది కడుపు కాదురా గడ్డ. గడ్డ కట్టేసిందిట లోపల. అది ఆపరేషన్ చేసి తియ్యాలిట. మనం రోజూ హార్లిక్సు, పళ్ళరసాలు పోసి, పెంచి అంతదాన్ని చేశాము. అంతా బూడిదలో పోసిన పన్నీరయింది. ఒక్క కొడుకు....పిల్లలుపుడ్తే చూసి ఆనందించాలనుకుంటే....మా కళ్ళు....పాపిష్టి కళ్ళమ్మా! అంతా ఖర్మ అనుకోరా నాయనా ఖర్మ!"

"ఊరుకోండి పిన్నిగారూ! దిగులు పడకండి. మీరే ఇలా అయితే ఆ చిన్నపిల్ల బెంగ పెట్టుకోదూ!" పక్కింటావిడ ఓదార్చింది.

"ఇప్పుడేమయిందని ఈ ఏడుపులు? మాకేమన్నా ముసలితనం వచ్చిందనుకున్నావా? ఆవిడ రాసిచ్చిన కాగితమేదీ?" అంటూ మందుల కాగితం తీసుకొని బజారుకెళ్ళాడు మాధవరావు.

రుక్మిణి పక్కమీద నీరసంగా పడుకుంది. ధారాపాతంగా కన్నీళ్ళు కారిపోతున్నాయి.

'ఇలా ఎందుకు జరిగింది? ఎలా జరిగింది?' పదే పదే ప్రశ్నించుకున్నది రుక్మిణి.

ఆ ప్రశ్నకు బదులేదీ?

"వాళ్ళకి ముసలితనం రాలేదమ్మా! మేము పెద్దవాళ్ళమయ్యాము కదా! వాళ్ళెప్పుడో కంటా మంటే....అప్పటిదాకా మేముండద్దూ? అంతా రాతనుకోండి....నా తలరాత! ఎవర్ని చూసినా ఇలా వస్తున్నారు....అలా పిల్లలు కంటున్నారు. మరి మా ప్రారబ్ధమేమిటో ఇలా తగలబడింది..."

భారతమ్మ ధోరణి తెలిసిన పక్కింటావిడ "వస్తానండీ! ఇంట్లో పని వుంది....వస్తా రుక్మిణీ" అన్నది.

ఆవిడను పంపించి తలుపేసి రుక్మిణి దగ్గరకు వచ్చింది భారతమ్మ. "ఎలావుంది? కొంచెం తగ్గినట్లుగా వుందా?"

లేదన్నట్లుగా తలాడించింది రుక్మిణి.

"కొంచెం హార్లిక్సు కలిపివ్వనా?" భారతమ్మ అడిగింది.

వద్దని తలూపింది రుక్మిణి.

"పెద్దవాళ్ళకూడా చూసి సంతోషించే మంచికళ్ళు వుండాలనుకో! మా ఖర్మకి నువ్వేం చేస్తావు? బాధపడకు. మీ మామగారు వూర్నించి వచ్చాక అదేదో తీయించేద్దాము. మాధవుడితో చెప్తాను....మీ అమ్మకి ఉత్తరం వ్రాయమని. వెంటనే ఆవిడ వస్తుంది."

"నన్ను క్షమించండి. నా వల్ల మీకు చాలా బాధ...." దుఃఖంతో గొంతుకు ఏదో అడ్డు పడినట్లయింది రుక్మిణికి.

"వెర్రితల్లీ! నువ్వేం చేస్తావు?" ఆవిడ కళ్ళల్లో నీరు తిరిగింది.

ఇంతలో స్కూటరు శబ్దమయింది మాధవరావు వచ్చాడు.

ఏవేళ్టికి ఏ మందేసుకోవాలో రుక్మిణితో చెప్పి 'అమ్మా తలుపేసుకో!' తల్లిని కేకేశాడు అతను.

"ఈ ఎండలో ఇప్పుడేం వెళతావురా? ఈ పూట ఆఫ్ పెట్టేయగూడదూ?"

కొడుకు వెనకాలే వస్తూ అన్నదావిడ.

"ఇంకా నయం! ఎండ అనుకుంటే ఉద్యోగస్థులకెలా కుదురుతుంది? అయినా లీవ్ పెట్టి ఏం చెయ్యను? మంచంమీద పడుకున్న మా ఆవిడని చూడనా? వంటింట్లో వుండే నిన్ను చూడనా? ఆఫీసుకెళ్తేనే సుఖంలే! సాయంత్రం త్వరగా వస్తానని రుక్మిణితో చెప్పు!" మాధవరావు వెళ్ళిపోయాడు.

కొడుకు కనుమరుగయ్యేదాకా నిలబడి తలుపేసి కోడలు దగ్గరికి వచ్చింది ఆవిడ.

కళ్ళు మూసుకు పడుకుంది రుక్మిణి.

రుక్మిణి లేచాక కాఫీ కలపొచ్చని చాప మీద మేను వాల్చింది భారతమ్మ. [సశేషం]


Edited & Published by B. Viswanatha Reddi for CHANDAMAMA CHILDREN'S TRUST FUND (Prop.

పెద్దకథ:

# అమ్మ

ఉండవల్లి జయశ్రీ

## 2

ఊరినుంచి వచ్చిన రామచంద్రయ్యగారు విషయం విని చాలా బాధపడ్డారు.

"ఆ చిన్నపిల్ల ఎన్ని ఆశలు పెట్టుకుందో! పెద్దవాళ్ళం మనమే ఆశాభంగాన్ని భరించలేము కదా!" అన్నాడాయన భార్యతో.

"నిజమే! ఆ దిగులే రుక్మిణిని కుంగదీస్తున్నది. వాళ్ళమ్మ వచ్చాక ఆస్పత్రిలో చేర్పిద్దాము."

మంచిరోజు చూసి హాస్పిటల్లో చేర్పించారు. ఆపరేషన్ కూడా అయిపోయింది.

రుక్మిణికి కొంచెం కులాసా చిక్కాక, రుక్మిణి తల్లి కూతుర్ని తీసుకొని వెళ్ళటానికే నిశ్చయించుకున్నది.

మాధవరావు కూడా స్థలం మార్పు మంచిదని ఒప్పుకున్నాడు.

వెళ్ళేరోజే అనసూయ వచ్చింది.

కుశల ప్రశ్నలయ్యాక చెప్పింది అనసూయ.

"మా వారికీవూరే ట్రాన్సఫరయింది. ఇల్లు చూడమని వ్రాశారు. మీ పక్కఇల్లు ఖాళీగా వుందా?"

"ఏమో! మా అత్తగార్ని అడుగుతా వుండు. నేనీ రోజే మా అమ్మతో వూరెళ్తున్నాను. నెలో రెండు నెలలో వుండి వస్తాను. ఉత్తరాలు వ్రాస్తుంటావు గదూ?"

"తప్పకుండా రాస్తాను. వెళ్ళి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో! ఏ ఆలోచనలూ పెట్టుకోకు. ఈ ఇల్లు కుదిరితే నీకు దగ్గరగా వుంటాను. మా పిల్లల్ని నీ దగ్గరికే పంపిస్తాను."

"అయితే నా కింక పిల్లలు పుట్టరంటావా?" దిగులుగా అన్నది రుక్మిణి.

"ఛ ఛ....అంతమాట అనకు. పిల్లలంటే నీకు సరదా అని నీ దగ్గరకు పంపిద్దామని అన్నాను. వేరేగా భావించకు!" బాధపడ్తూ అన్నది అనసూయ.

భారతమ్మని తీసుకెళ్ళి ఆ ఇల్లు చూసొచ్చింది అనసూయ.

"ఇంటివాళ్ళు వూళ్ళో లేరుట. వారం పది రోజుల్లో వస్తారని ఆ పక్కవాళ్ళు చెప్పారు. అప్పుడు కనుక్కొని నీకు ఉత్తరం వ్రాస్తాను!" అని చెప్పి అనసూయ వెళ్ళిపోయింది.

వెళ్ళబోతూ అత్తగారికి మామగారికి నమస్కరిస్తుంటే కళ్ళల్లో నీరు తిరిగింది రుక్మిణికి. 'వస్తానండీ!' మాధవరావుకు మరోసారి చెప్పింది.

"నే చెప్పినవన్నీ గుర్తున్నాయిగా! వేళకి మందులు తీసుకో! వెంట వెంట ఉత్తరాలు వ్రాస్తుండు. త్వరగా వస్తావుగా!" భార్య చేతిని ఆప్యాయంగా నొక్కి వదిలాడు మాధవరావు.

"అమ్మా రుక్మిణీ! పెద్దదాన్ని చాదస్తం కొద్దీ ఏదన్నా మనసులో పెట్టుకోకు. ఆరోగ్యం బాగు చేసుకొని త్వరగా రా!" కోడలి తలని చేత్తో నిమురుతూ అన్నది భారతమ్మ.

"మీకింత వరకూ మనవడిని అందించలేకపోయాను. మీరే నన్ను క్షమించాలి!" కన్నీటితో అన్నది రుక్మిణి.

"దేవుడిస్తే దయ్యమైనా కంటుందని పెద్దలు చెప్తారు. దాని గురించి నువ్వేం దిగులుపడకు." అందరి ఆశీర్వాదం తీసుకొని బయల్దేరింది రుక్మిణి.

*

రుక్మిణి తిరిగొచ్చేసరికి అనసూయ ఆడపిల్లను ప్రసవించింది.

ప్రయాణపు బడలికను కూడా లెక్కచెయ్యక వెంటనే వెళ్ళింది రుక్మిణి.

"ఎంత బాగుందో పాప! చాలా చక్కగా వుంది. నిజంగా అనసూయ అదృష్టవంతురాలు." మనసులోనే నిట్టూర్చింది.

"కులాసాగా వున్నావా రుక్మిణీ!" ఆదరంగా అడిగింది అనసూయ.

"నేను బాగానే వున్నాను. నువ్వెలా వున్నావు?"

"చూస్తున్నావుగా! మావారి కోరిక ప్రకారం ఆడపిల్లనే కన్నాను. మంచి పట్టుచీర ప్రెజెంట్ చేస్తానన్నారు."

"ఒక్క చీరేనేమిటి? ఏకంగా అరడజను కొనెయ్యచ్చు. ఇంత చక్కటి పాపను నువ్వు ప్రెజెంట్ చెయ్యలేదూ?" పాపను తనివితీరా చూస్తూ అన్నది రుక్మిణి.

"అనసూయా! పాపని ఒకసారి లోపలికి తీసుకురావే! దిష్టి తీసి పడుకోబెడ్తాను. అందరి కళ్ళు మంచివి కావు." బామ్మగారి గొంతు విన్పించింది లోపల్నించి.

అప్రయత్నంగా తలెత్తి అనసూయవంక చూసింది రుక్మిణి.

వెంటనే పాప మీదున్న తన చేతుల్ని తీసేసి "లోపలికి తీసుకెళ్ళు అనసూయా! బామ్మగార్కి ఇచ్చిరా!" నవ్వటానికి ప్రయత్నం చేస్తూ అన్నది రుక్మిణి.

"సారీ రుక్మిణీ! నిన్ను బాధ పెట్టాలని బామ్మ ఉద్దేశం కాదు. ఇంతకుముందే ఆవిడెవరో వచ్చి వెళ్ళింది. అందుకని భయపడుతున్నది!" పిల్లని తీసుకొని లేస్తూ అన్నది.

అనసూయ లోపలికి వెళ్ళొచ్చినా కూడా రుక్మిణికి ఆలోచనలు వదల్లేదు.

బామ్మగారి భయాన్ని గుర్తించమన్నదిగాని, అనసూయ తన మనసుని అర్థం చేసుకోలేకపోయింది.

'తన కళ్ళకు, పసివాళ్ళ మీద తనకుండే

ప్రేమకు అనసూయ కూడా భయపడుతున్నదా?' చప్పున రుక్మిణి కళ్ళల్లో నీరు తిరిగింది.

"క్షమించు రుక్మిణీ; నిన్ను చాలా బాధ పెట్టాను. బామ్మకి ఎలా మాట్లాడాలో తెలియదు. వయసొస్తున్న కొద్దీ చాదస్తం ఎక్కువవుతున్నది. నువ్వు మనసు కష్టపెట్టుకోకు!" భుజం మీద చెయ్యేస్తూ అన్నది అనసూయ.

"అబ్బే! నేనేం బాధపడటంలేదు. కాని... బామ్మగారి దృష్టిలో నేను గొడ్రాలినై పోయానా?"


ఆ మాట అంటుంటే రుక్మిణికి ఏడుపు ఆగలేదు.

పిల్లల కోసం స్నేహితురాలు పడే ఆరాటం చూస్తుంటే మనసు ద్రవించింది అనసూయకు.

"రుక్మిణీ! నన్ను క్షమించాలి. నువ్వు సంతోషంగా వచ్చావు నా కోసం. నిన్ను దుఃఖంతో ఇంటికి పంపిస్తున్నాను నేను. బామ్మ మాటలు పట్టించుకోకు. నువ్వు ఎప్పటిలాగా వస్తూండాలి." రుక్మిణి చేతిని వదల్లేక వదులుతూ అన్నది అనసూయ.

"నేను బాధపడ్తున్నానేమోనని నువ్వు బాధ పడకు. ఈ రోజు నాకో నిజం అర్థమయింది. సంఘం దృష్టిలో నేను గొడ్రాలినై పోయాను. ముందు ముందు ఎక్కడికి వెళ్ళినా ఇలాంటి మాటలే వినాల్సి వస్తుందని ముందుగానే బామ్మ గారు హెచ్చరించారు. అందుకు నేను బామ్మగారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి!" రుక్మిణి తేలికగా నవ్వుతూ అన్నది.

ఆ నవ్వు చూస్తూనే తెలిసిపోయింది అనసూ



యకు — రుక్మిణి హాలాహలాన్ని మింగుతూ అమృతం చిందిస్తున్నదని.

ఆ రోజునుంచి అడుగు బయట పెట్టటానికి ఇష్టపడలేదు రుక్మిణి.

అత్తగారు ఎన్నిసార్లు బలవంతం చేసినా మళ్ళీ ఏ పేరంటానికిగానీ, పెళ్ళికిగానీ వెళ్ళటానికి ఒప్పుకోలేదు. మాధవరావు బాగా విసుక్కున్న రోజు మటుకు తప్పదని అతనితో కలిసి బయటకు వెళ్తున్నది.

మాధవరావు మంచి స్నేహితుడిగా రుక్మిణికి చాలా ధైర్యం చెప్పాడు: "రుక్మిణీ! నువ్వు బాధపడ్తున్న కొద్దీ ఈ లోకం నిన్ను మరీ బాధ పెడుతుంది. నువ్వు ఈ శాకుల్ని భరించలేక పారిపోతున్న కొద్దీ నీ వెంట పడ్తూనే వుంటాయి; నిన్ను మరింత బెదరకొడ్తూనే ఉంటాయి. నువ్వు ఒక్కసారి ఎదురు తిరుగు. ఎక్కడివి అక్కడ సర్దుకుంటాయి. తప్పకుండా తల్లివవుతావన్న డాక్టరు మాట గుర్తుంచుకో! ముందు నీ మీద నీకు నమ్మకం కల్గాలి. ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. దిగులూ బెంగా మనిషిని కుంగదీస్తాయి. ఉత్సాహం లేకపోతే భవిష్యత్తే లేదు రుక్మిణీ! పిల్లలు లేకపోవటం పాపం కాదు .... వరం అంటున్నారిప్పుడు డాక్టర్లు. నువ్వు పిల్లల గురించి మరీ పిచ్చిగా ఆలోచిస్తున్నావు. నీకంతగా పిల్లలు కావాలనుకుంటే ఎవర్నైనా చూసి పెంచుకుందాము. ఈ చిన్న విషయానికి నువ్వు బాధపడి నన్ను బాధపెట్టకు ప్లీజ్! నువ్వు నవ్వుతూ వుండు."

"ఇప్పుడు....నేను నవ్వక ఏడుస్తున్నానా? మీరు కూడా ఒకసారి పరీక్ష చేయించుకుంటారా?"

"అలాగే! నేను కూడా టెస్టు చేయించుకుంటే రిజల్టు ఏమిటో తెలిసి పోతుంది!" నవ్వుతూ అన్నాడు మాధవరావు.

రిపోర్టు వచ్చింది. తండ్రి అయ్యే అర్హతలన్నీ మాధవరావులో వున్నాయి.

సగం బెంగ తీరింది వాళ్ళకు.

"ఇద్దరిలోనూ లోపం లేదు. ఇంక ఆ దేవుడి మీదే భారం వేసి నిశ్చింతగా వుండు!" భారతమ్మ అన్నది రుక్మిణితో.

అత్తగారు ఆ మాత్రం ధైర్యం చెప్పినందుకు సంతోషించింది రుక్మిణి.

*

రోజులు గడిచిపోతున్నాయి. నెలలు దొర్లిపోతున్నాయి. సంవత్సరాలు తిరిగిపోతున్నాయి.

నాలుగోపిల్లాడు పుట్టాక అనసూయకు బాగా జబ్బు చేసింది. బామ్మగారు కాలధర్మం చెందటంతో వాళ్ళకు పెద్దదిక్కు లేకపోయింది.

అనసూయతల్లి అటూఇటూ తిరగలేక పసివాడి ఆలనాపాలనా చూడలేక సతమత మవుతుంటే అప్రయత్నంగానే ఆ భారాన్ని రుక్మిణి తీసుకున్నది.

అనసూయ చేరిన నర్సింగ్‌హోమ్ రుక్మిణి ఇంటికి దగ్గరగా వుండటం ఒక కారణం.

బాబుని అపురూపంగా చూసుకుంటున్నది రుక్మిణి. ఎవర్నీ అడక్కుండా రవిచంద్ర అని పేరు పెట్టేసింది రుక్మిణి.

"అదేం పేరు? సూర్యుడూ, చంద్రుడూ ఒకే చోట వుంటారా?" నవ్వుతూ అడిగింది అనసూయ.

"మంచి వాళ్ళకు చల్లగా, దుర్మార్గులకు వేడిగా వుంటాడు బాబు. అందుకని ఆ పేరుతో పిలుస్తున్నాను. నువ్వూ, మీవారూ ఏమీ అనుకోలేదు కదా?"

"నేనేమీ అనుకోనని నీకు తెల్సు. మా వారంతకంటే అనుకోలేదు. నీకు చాలా శ్రమ ఇస్తున్నాను. అందుకు నాకెంతో సిగ్గుగా వుంది." నెమ్మదిగా అన్నది అనసూయ.

"రవిచంద్రని పెంచటం శ్రమని నేనెప్పుడూ అనుకోలేదు అనసూయా! దాన్ని నేను వరంగా భావిస్తున్నాను, నిన్నెప్పుడు డిస్చార్జి చేస్తారు?" బత్తాయిపండు ఒలుస్తూ అన్నది రుక్మిణి.

"ఇంకో వారం రోజులు పడుతుందనుకుంటాను. బాబుని తీసుకు రాకపోయావా? రెండ్రోజులయింది చూసి. కళ్ళముందే మెదుల్తున్నాడు."

"రేపు తీసుకొస్తాను. ఆస్పత్రులవెంట ఆ పసివాడిని తిప్పటమెందుకన్నారు మా అత్తగారు. అదీగాక ఈ రోజు ఒళ్ళు కొంచెం వెచ్చగా వుంది!" వెళ్ళటానికి లేస్తూ అన్నది రుక్మిణి.

"ఏమిటీ బాబుకి ఒంట్లో బాగా లేదా? ఆస్పత్రికి తీసుకెళ్ళావా? పోనీ మా అమ్మకి ఇచ్చేయలేక పోయావా?" ఆదుర్దాగా పక్కమీద నుంచి లేచింది అనసూయ.

"అంత కంగారు పడాల్సింది ఏమీ లేదు. పళ్ళొస్తున్నాయేమో మోషన్స్ అవుతున్నాయి. వానిలో ఒళ్ళు కొంచెం వెచ్చగా వుంది. నువ్వు ముందు పడుకో!"

"ఇంకేం పడుకోను? వాడికి ఒంట్లో బాగుండకపోతే ఇక్కడ నాకెలా నిద్రపడ్తుంది? రెండ్రోజులయింది చూసి. ఈ రోజైనా తీసుకొస్తావనుకున్నాను. అయినా పసివాళ్ళ గురించి నీకేం తెలుసని నువ్వు పెంచుతున్నావు రుక్మిణీ? శ్రమ అనుకోకుండా మా అమ్మా వాళ్ళింటికి వెళ్ళి బాబుని ఇచ్చిరా! నిన్న రాత్రి మా మేనత్త వచ్చిందిట. ఆవిడ చూసుకుంటుంది బాబుని. తెలిసీ తెలియని నీ పెంపకంలో బాబుకేమన్నా అయితే ఆయన నన్ను చంపేస్తారు. ఇప్పుడు ఇంటికి వెళ్ళగానే బాబుని మా ఇంట్లో దింపుతావు కదూ!"

ఎక్కువసేపు మాట్లాడేసరికి ఆయాసపడింది అనసూయ.

కన్నీరు గిర్రున తిరిగింది రుక్మిణికి.

"బాబు ఆలనాపాలనా అంతా నేను చూస్తున్నా మా అత్తగారి సలహాలు తీసుకుంటూనే వున్నాను. పిల్లల పెంపకం గురించి నాకు తెలియకపోయినా పెద్దవారు మా అత్తగారికి తెలుసుకదా! బాబుని రేపు తీసుకొచ్చి చూపిస్తాను. రవి క్షణం కనిపించకపోతే నాకు పిచ్చెత్తినట్లు వుంటుంది. ప్లీజ్....నీ ఆరోగ్యం కుదుటపడేదాక వాడిని నా దగ్గరే వుండనీ!" గద్గదంగా అన్నది రుక్మిణి.

అనసూయ బాధపడింది. అలా మాట్లాడాలని కానీ, స్నేహితురాలి మనసు నొప్పించాలని కానీ అనసూయ అనుకోలేదు. కాని....తల్లి మనసు ఆగలేకపోయింది. కొడుకు క్షేమం గురించి అమ్మ హృదయం ఆదుర్దాపడింది. ఆవేశంలో తానన్న మాటలు రుక్మిణికి ఎంత బాధ కల్గించాయో? సిగ్గుపడింది అనసూయ.

"సారీ రుక్మిణీ! తొందర్లో ఏదో అనేశాను. ఏమీ అనుకోకు. బాబుకి బాగుంటేనే రేపు తీసుకురా! అయినా మీ అత్తగారున్నారుగా? ఏమిటో మర్చిపోయాను. నా మాటలు పట్టించుకోకు!" ఈ మాటలతో రుక్మిణి బాధ తొలిగిపోతుందనుకున్నది అనసూయ.

"నీ తల్లిమనసు అర్థం చేసుకొనే ప్రయత్నంలో వున్నాను అనసూయా! వెళ్ళొస్తాను!" గబగబా అక్కడ్నించి వచ్చేసింది రుక్మిణి.

భారతమ్మ, మాధవరావు కూడా ఎన్నోసార్లు చెప్పారు రుక్మిణికి: "బాబు మీద అంత మమత పెంచుకోకు. అనసూయ ఇంటికి రాగానే వాడూ

వాళ్ళింటికి వెళ్ళిపోతాడు. రవి దూరమయ్యాడని ఆ రోజు ఏడవకుండా వుండాలంటే ఈ రోజునుంచే నువ్వా క్షణం కోసం సిద్ధపడాలి. పరాయి పిల్లల్ని ఎలా పెంచినా, ఎంత ప్రేమించినా నీపిల్లలవుతారా? నిన్ను అమ్మా అని పిలుస్తారా? ఎందుకొచ్చిన తాపత్రయం? స్నేహితురాలు ఇబ్బందిలో వుంది. ఆమెకు సాయపడాలనుకున్నావు. బాగానేవుంది. నీ ఫ్రెండ్ కొడుకుగానే భావించి బాబును పెంచు. అంతకు మించిన ఊహేదీ మనసులోకి రానీయగూడదు....రానీయకు.''

వాళ్ళు చెప్పిన మాటలన్నిటికి అప్పుడు తలూపింది రుక్మిణి.

కాని....రోజులు గడుస్తున్నకొద్దీ రవిచంద్ర మీద ప్రేమ కొండలాగా పెరిగిపోయింది.

బాబంటే తనకెందుకింత ఇష్టం? క్రిందటి జన్మలో వీడు తన కొడుకే అయుంటాడు. ఈ జన్మలో ఇలా వచ్చి బంధం వేశాడు. రవి తనని వదలి ఎక్కడికీ వెళ్ళడు. వెళ్ళినా తన కోసం బెంగ పెట్టుకొని జ్వరం తెచ్చుకుంటాడు. వెంటనే బాబుని తీసుకొచ్చి తన చేతుల్లో పెట్టి 'ఈ రోజునుంచి నువ్వే వాడికి తల్లివి. నిన్నంతా నువ్వు కన్పించలేదని బాబు ఒకటే ఏడుపు. సముదాయించలేకపోయాను. నువ్వే పెంచి పెద్దవాడిని చెయ్యి. కావాలంటే దత్తత తీసుకో!' అని అనసూయ అంటుందని ఊహిస్తుండేది రుక్మిణి ఇన్నాళ్ళూ. కాని—ఆ రోజు ఒక నిజం తెలిసింది.

''కన్నతల్లి హృదయం పుష్పక విమానం లాంటిది. ఎంతమంది పిల్లల్ని కని ప్రేమిస్తున్నా అందులో ఇంకో సంతానానికి చోటు వుంటూనే వుంటుంది!'' అనుకుంది ఆమె.

ఆ రోజు నుంచి రుక్మిణి ప్రవర్తనలో కొంత మార్పు వచ్చింది.

రవికి నీళ్ళుపోసి, పాలుపట్టి భారతమ్మ పక్కలో పడుకోబెట్టింది.

''ఇదేమిటి రుక్మిణీ! బాబుని ఇక్కడ పడుకోబెట్టావేం?'' ఆశ్చర్యంగా అడిగింది ఆవిడ.

''కాస్సేపు నా దగ్గర పడుకోబెట్టవే!'' అని ఆవిడ ఎప్పుడైనా సరదాపడి అడిగితే ''జోలపాట పాడితేకాని నిద్రపోడు. నిద్రపొయ్యాక తీసుకొచ్చి మీకిస్తాను!'' అనేది రుక్మిణి.

రవిచంద్రని క్షణం వదిలేది కాదు. ఆ పిచ్చి



కుమారి చందు సుజాత

కేరాఫ్ చందు వరమయ్య
అసిస్టెంటు గవర్నమెంట్ ప్లీడర్
నాజరుపేట, తెనాలి, గుంటూరు జిల్లా.

వయసు 17 సం॥లు. స్కూల్ ఫైనల్ వరకూ చదువుకున్నారు. కొత్తరకాల వంటలు చేయడం, తోటపని, రకరకాల ప్రదేశాలు చూడడం అంటే ఇష్టం. కుట్లు, అల్లికలు, ముగ్గులు పట్ల ఆసక్తి చూపుతారు. చిత్ర రచనను అభ్యసిస్తున్నారు. అన్ని ప్రాంతాల వనితలతోనూ స్నేహం చెయ్యాలని ఆశిస్తున్నారు.

కుమారి వి. వీణావాణి

**10-36, ఆకుతోట వీధి, తిరుపతి-517501.**

వయసు 19 సం॥లు. బి. కామ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. కథలు, గేయాలు రాస్తుంటారు. సినిమాలు చూడడం పట్ల ఎక్కువ ఆసక్తి వుంది. మంచి రచయిత్రిగా పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నారు. రచనలకు అవసరమైన విషయాలను స్నేహితుల దగ్గరనుంచి సేకరిస్తూ వుండడం, సాహిత్యానికి సంబంధించిన విమర్శలు ఉత్సాహంగా చదువుతూ వుండడం—అభిరుచులు.

పి. శేషకుమారి

**కేరాఫ్ పి. సుబ్బారావు**
**బి-28**, లింగంగుంట్ల కాలనీ, నర్సరావు పేట,
గుంటూరు జిల్లా.

18 సం॥ల వయసు. ఇంటర్ వరకూ చదువుకున్నారు. వైర్స్‌తో బుట్టలు, కుర్చీలు, మంచాలు అల్లడం నేర్చుకున్నారు. బట్టలమీద ఎంబ్రాయిడరీ నెయ్యడం, పూసలతో బొమ్మలు తయారుచేయడం పట్ల కూడా మంచి ఆసక్తి ఉంది. ''పుస్తకాలు చదవడం అంటేచాలా ఇష్టం'' అంటారు.

కుమారి పి. రాధ

**డాటర్ ఆఫ్ పి. ఎస్. ఆర్**
**20/334 ; కో-ఆపరేటివ్ కాలనీ, కడప.**

వయసు 18 సం॥లు. ఇంటర్ చదువుకున్నారు. పత్రికలు చదవడం, కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, చిన్న పిల్లల దుస్తులు తయారుచేయడం, పూలమొక్కలు పెంచడం అభిరుచులు.

కుమారి టి. వి. జయలక్ష్మి

**డాటర్ ఆఫ్ టి. ఎస్. వెంకటాచలం, కాంట్రాక్టరు.**
**1/168, వీవర్స్ కాలనీ. యమ్మిగనూరు-518 360**
**కర్నూలు జిల్లా**

వయసు 21 సం॥లు. ఎస్. ఎస్. ఎల్. సి వరకు చదువుకున్నారు. ప్రస్తుతం ప్రైవేటుగా తెలుగు విద్వాన్ చదువుతున్నారు, వైర్ బాగ్స్ అల్లడం, స్టాంప్స్ సేకరించడం, రకరకాల ఎంబ్రాయిడరీ పనులు నేర్చుకోవడం సరదాలు. ''లలిత సంగీతం వినడం, కలం స్నేహితులకు ఉత్తరాలు రాయడం, పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం'' అంటారు.

కుమారి పి. హెచ్. అనితా సాగర్

**డాటర్ ఆఫ్ పి. హెచ్. విద్యాసాగర్**
**3-2-689/1 బి, చప్పల్ బజార్,**
**హైద్రాబాదు-500 027.**

వయసు 19 సం॥లు. బి. ఏ. ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. పుస్తకాలు చదవడం, రేడియో కార్యక్రమాలు వినడం, స్టాంపుల సేకరణ హాబీలు. విమర్శలు, ముగ్గులు, చిన్నచిన్న రచనలు పత్రికలకు పంపిస్తూ ఉంటారు. ఫ్రెంచి భాషలో ప్రవేశం ఉంది. కారమ్స్, చదరంగం-ఆటలపట్ల ఉత్సాహం ఉన్నది.

ప్రేమకు ఒక్కోసారి నివ్వెరపోయేది భారతమ్మ. వినుక్కొనేవాడు మాధవరావు.

"ఒక్కసారి ఎత్తుకుంటాను. ఇవ్వవే" అన్నా ఇవ్వని కోడలు ఈ రోజు అడగకుండానే తన పక్కలో పడుకోబెట్టేసరికి వింత అన్పించింది ఆవిడకు.

"ఏమయింది రుక్మిణీ! అలా వున్నావేం! అనసూయ ఏమైనా అన్నదా?" ఆదుర్దాగా అన్నది.

'ఊహుం' తల అడ్డంగా తిప్పింది.

"రవికి ఒళ్ళు వెచ్చ చేసిందని భయపడుతున్నావా?"

లేదన్నట్లుగా తలూపింది.

"అనసూయ మొగుడు ఏదైన అన్నాడా?"

"ఆయనింకా రానేలేదు."

"అయితే ఇంకేమిటి! అనసూయకు ఒంట్లో ఎలా వుంది?" కంగారుగా అన్నది భారతమ్మ.

"బాగానే వుంది. వారం పదిరోజుల్లో డిస్చార్జి చేస్తారట!" మెల్లగా చెప్పింది రుక్మిణి.

ఆవిడ కంగారు తీరింది. అనసూయ గురించి బాధపడ్తున్నదేమో అనుకుంటే .. అదీ కాదు.

"మరెందుకు అలా వున్నావు? ఎందుకు బాధపడ్తున్నావో చెప్పమ్మా!" ఆవిడ ఆదరంగా అడిగింది.

"ఏం లేదు అత్తయ్యగారూ! నాకేం బాధ లేదు" అని అక్కడ్నించి వెళ్ళిపోయింది.

భారతమ్మకు రుక్మిణి ప్రవర్తన అంతుబట్టలేదు.

కాని మాధవరావు కనిపెట్టాడు: "అయితే నీ ఫ్రెండ్ కొన్నాళ్ళు, కొన్నేళ్ళు హాస్పటల్‌లో వుంటేనే మంచిదంటావు!" అంటూ నవ్వాడు.

"ఛ..ఛ! అలా అన్నానా నేను? ఇప్పటికే ఎంతో చిక్కిపోయింది. ఎముకల గూడులా మిగిలిపోయింది. అనసూయ ఆరోగ్యంగా వుండాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. తెలుసా?" ఆమె మాటల్లో కోపం ధ్వనించింది.

"ఆ సంగతి మటుకు తెలియదు కాని....మీ అనసూయ హాస్పిటల్ నుంచి రావటం, రవిచంద్ర మనింట్లోనుంచి వెళ్ళటం ఒకేసారి జరుగుతాయని తెలుసు!" భార్యని పరీక్షగా చూస్తూ అన్నాడు మాధవరావు.


"బాబు ఈ ఇంట్లో వాడు కాదు" అని పరోక్షంగా చెబ్తున్నట్లు అనిపించింది రుక్మిణికి.

"ఆ సంగతి నాకు తెలుసు. అందుకే రవిచంద్రకి దూరంగా వుండాలని ప్రయత్నిస్తున్నాను."

"ఆ ప్రయత్నాన్ని నువ్వు సాధిస్తావని నేను ఆశిస్తున్నాను." మరో మాటకి అవకాశం ఇవ్వకుండా అక్కడ్నించి వెళ్ళిపోయాడు మాధరావు.

నివ్వెరపోయింది రుక్మిణి.

'ఆయన మొదట్నించీ చెబ్తూనే వున్నారు. నేనే అతిగా అభిమానం పెంచుకున్నాను. ఇప్పుడు తెంచుకుందామన్నా తెగనంత బలంగా పెరిగిపోయింది. కంటేనే పిల్లలా? కనకపోతే శత్రువులా? కన్నప్రేమకన్నా పెంచిన ప్రేమ గొప్పది కాదా? కన్నతల్లికైనా పిల్లల్ని పెంచటం వల్లనే ఆ ప్రేమ బలపడుతున్నదేమో!' అనుకున్నది ఆమె.



లావొక్కింతయు లేదు....

అమెరికాలోని ఓహియోకు చెందిన శ్రీమతి జెర్రీకార్లీకి తన బరువు పెద్ద సమస్య అయింది. **36** ఏళ్ళ జెర్రీ బరువు **209** పౌన్లు. ఆరు వారాల్లో **50** పౌన్ల బరువు పెరగడంతో ఆమె కంగారు పడింది. కనీసం **84** పౌన్లయినా తగ్గాలన్న ఉద్దేశంతో పలువరుసల మధ్య తీగెలు (దడి) అమర్చుకుంది. ఈ తీగెలవల్ల ఆమె నోరు తెరిచి ద్రవ పదార్థాలు మాత్రమే తాగగలదు. అంతకన్నా నోరు తెరవడం సాధ్యం కాదు కనుక, ఏదీ తినే వీలుండదు. అలా తాను సన్నబడగలనని ఆమె విశ్వాసం!

*

ఎంత కాదనుకున్నా బాబు చేత 'అమ్మా' అని పిలిపించుకోవాలన్న కోరికను తుడిచి వేయలేక పోతున్నది రుక్మిణి.

'రవి తన బిడ్డకాదు!' ఝల్లు మన్నది రుక్మిణి హృదయం. 'ఊహలోనే బాబు తనకు దూరమవుతున్నాడంటే నిలవలేక పోతున్న తాను. అనుభవంలోకి వస్తే ఎలా భరించడం?' కన్నీటిని చీర కొంగుతో తుడుచుకుంటూ అనుకున్నది.

రుక్మిణి కన్నీరు జాలువారి బాబు మీద పడింది. వాడు ఉలిక్కిపడి కళ్ళు విప్పి రుక్మిణిని చూసి నవ్వాడు. ఆ బోసినవ్వుకి ఆమె పులకరించి పోయింది.

"ఏం నాన్నా! నాకు దూరంగా వెళ్ళిపోతావా! నా గురించి బెంగపెట్టుకోవూ? అందర్నీ ఎదిరించి నన్ను 'అమ్మా' అని పిలుస్తావు కదూ! మీ అమ్మ దగ్గరకు వెళ్ళకుండా నా దగ్గరే ఉంటావు గదూ!" బాబును ముద్దు పెట్టుకుంటూ అన్నది.

"ఏమిటీ రుక్మిణీ ఆ మాటలు? ఎవరైనా వింటే నవ్విపోగలరు. నిన్నిలా చూస్తుంటే నీ పిచ్చి నాకు ఎక్కుతుందేమోనని భయమేస్తున్నది." భారతమ్మ మందలింపుగా అన్నది.

"రవి మనింట్లోంచి వెళిపోతాడన్న ఊహ నాకు చాలా బాధ కల్గిస్తున్నది. ఈ పరిస్థితిలో పిచ్చెక్కితేనే బాగుందనిపిస్తుంది!" తన మనసులో మాట చెప్పేసింది రుక్మిణి.

"ఇప్పుడు లేకపోతేకదా? పిచ్చి మాటలు వెర్రి వేషాలు! దేశంలో పిల్లలు లేనివాళ్ళు ఎంత మందిలేరు? వాళ్ళందరూ ఇలాగే పక్కింటిపిల్లల మీద వ్యామోహం పెంచుకుంటున్నారా? పూర్వ జన్మలో మనమెవరికీ ఒక్క పైసైనా దానం చేసుకోలేదని సరిపెట్టుకోవటమే. మనకెవరూ ఋణపడి లేరని నిర్లిప్తంగా ఊర్కోవడమే చెయ్యాలి కాని.. తెల్లవారి లేచిన దగ్గర్నుంచి ఇదే రామనామంలా అనుకుంటే వచ్చే మోక్షమేమిటో నాకు చెప్పు? ఇన్నాళ్ళూ నేనూ మీ మామగారూ బాధ పడ్డాము. భయపడ్డాము. దాని వల్ల ఏం ప్రయోజనం కలిగింది? మమ్మల్ని చూసి నువ్వు మరింత దిగులు పెంచుకున్నావు. ప్రాప్తముంటే పుడతారు. మనమెన్నిసార్లు ఎంత మంది దగ్గర అనుకుంటే ఏం లాభమని మేము వూర్కున్నాము కాని....నీకు చెప్పలేక పోతున్నాము. వేదాంతం ఎంత విరక్తిని పుట్టిస్తుందో, ఒక్కోసారి అంత శాంతినీ కల్గిస్తుంది. ప్రయత్నం చేయి!" అంటూ భారతమ్మ బాబుని తీసుకెళ్ళి ఉయ్యాల్లో పడుకోబెట్టింది.

మనిషిగా బాబుకి దూరంగా వున్నా మనసుని అదుపులో పెట్టలేక పోతున్నది రుక్మిణి.

బాబు ఆలోచనలలోంచి తప్పించుకోలేక పోతున్నది రుక్మిణి. [సశేషం]

## 3

అనసూయ హాస్పటల్ నుంచి వచ్చేసరికి మలో ఇరవై రోజులు పట్టింది.

ఈ లోగా రవి మరింత ఆత్మీయుడయ్యాడు ఆ ఇంట్లో అందరికీ.

రవిచంద్ర కన్నతల్లి దగ్గరకు వెళ్ళేరోజు వచ్చింది.

అందరి కళ్ళల్లోనూ నీళ్ళు నిండాయి.

గుండెలు బరువుగా వున్నాయి.

అనసూయ రవిని ఎత్తుకు వెళ్తుంటే రుక్మిణికి ఏడుపు ఆగక లోపలికి పరుగెత్తింది.

“ఇంకా కొన్నాళ్ళు వుంచకూడదమ్మాయ్! మా రుక్మిణి బెంగపెట్టుకుంటుందేమో అని భయంగా వుంది....” రామచంద్రయ్యగారు అడగలేక అడిగారు.

“ఇప్పటికే రుక్మిణికి ఎంతో బాధ కలిగించాను. బాబుని తీసుకెళ్ళిపోవటమే మంచిదనుకుంటున్నాను. ఏమంటారు అన్నయ్యగారూ?” మాధవరావుని అడిగింది అనసూయ.

“నిజమేనమ్మా! తీసుకెళ్ళు—ఎక్కడి వాళ్ళు అక్కడ వుంటేనే మంచిది” నిర్లిప్తంగా అన్నాడు. రవిని రుక్మిణికి ఇచ్చేయనా అని క్షణం ఆలోచించింది అనసూయ.

మనసొప్పలేదు. ఆ ఊహే బాగుండలేదు. ‘కని పెంచే తల్లికి పిల్ల భారమా?’ అనుకుని బాబుని తీసుకెళ్ళిపోయింది అనసూయ.

వెళ్ళబోయే ముందు రుక్మిణి ముఖం చూస్తుంటే అనసూయ అడుగు ముందుకు పడేది కాదు. బాబుని రుక్మిణి ఒళ్ళో పడుకోబెట్టి గాని కదిలేది కాదు.

‘గుండె పగిలి పోతుందేమో’ అనుకున్నది రుక్మిణిని చూసి భారతమ్మ.

‘అమ్మాయికి పిచ్చిగానీ ఎక్కదు కదా!’ అని రామచంద్రయ్యగారు భయపడ్డారు.

‘రుక్మిణి జీవితంలో నవ్వుకు చోటుందా?’ అనుకుని కలవరపడ్డాడు మాధవరావు.

వీళ్ళ ఆలోచనలను అబద్ధాలు చేస్తూ రెండు మూడు రోజులకే మామూలు మనిషయింది రుక్మిణి.

అందరితోనూ నవ్వుతూ మాట్లాడింది. అత్తగార్ని వెంటబెట్టుకు వెళ్ళి రవిని చూసొచ్చింది.

‘బాధను మనం అనుభవించాలి. నవ్వుని నలుగురికీ పంచాలి’ అన్న సిద్ధాంతాన్ని నమ్మి తన ఆవేదనను పైకి తొణకనీయకుండా లోలోపలే అణచుకున్నది రుక్మిణి.

కోడలు సరదాగా వుండటం చూసి తేలికపడింది రామచంద్రయ్యగారి మనసు. కాని....రవి లేక పోవటంతో ఇంట్లో సందడి తగ్గిపోయింది. రవి ఉయ్యాల కన్పించకపోవటంతో వాళ్ళకేమిటో వెలితిగా అనిపించింది.

మనసులో కొండంత నిరాశ పేరుకుపోయింది.

ఇంకా తండ్రి కాని కొడుకునూ, గొడ్రాలుగా వున్న కోడల్ని చూడలేక రెండురోజుల వ్యవధిలో

# పెద్దకథ: అమ్మ

## ఉండవల్లి జయశ్రీ

భారతమ్మ, రామచంద్రయ్యగారు వెళ్ళిపోయారు.

తట్టుకోలేకపోయింది రుక్మిణి. భరించలేక పోయాడు మాధవరావు.

మూడు నెలలు సెలవు పెట్టి ఇద్దరూ తీర్థ యాత్రలు చెయ్యటానికి వెళ్ళిపోయారు.

పుణ్యక్షేత్రాలు, విహారస్థలాలు చూశాక మనసుకి కొంచెం స్తిమితం చిక్కినట్లనిపించింది.

*

ఊరికి తిరిగొచ్చేసరికి మాధవరావుకి ట్రాన్స్‌ఫర్ సిద్ధంగా వున్నది.

ఆ ఇంటిని అద్దెకిచ్చేసి అనసూయకు ఇల్లప్పగించి బయల్దేరారు.

వెళ్ళేటప్పుడు రుక్మిణికి, అనసూయకు ఏడుపు ఆగలేదు.

‘రుక్మిణిలాంటి మంచి స్నేహితురాలు మళ్ళీ దొరకదు’ అనుకుంది అనసూయ.

‘మనసుని అర్థం చేసుకొని మాట్లాడే అనసూయల కోసం మళ్ళీ ఎక్కడ వెతకను? వెతికినా కన్పించరు’ అనుకున్నది రుక్మిణి.

“రుక్మిణీ! బద్ధకించకుండా ఉత్తరాలు వ్రాస్తుండు. నీకెప్పుడు రావాలనిపిస్తే అప్పుడు మా ఇంటికి వచ్చేయి. నీకు తోబుట్టువులు లేనందుకు నన్ను నీ అక్కగా భావించి నా దగ్గరికి వస్తూ పోతూ వుండాలి.” బొట్టుపెట్టి చీరా, జాకెట్టు అందిస్తూ అన్నది అనసూయ.

“నీ వంటి స్నేహితురాలు దొరకటం నా పూర్వజన్మ సుకృతం. పిల్లల గొడవలో పడి నా ఉత్తరాలకు జవాబివ్వటం ఆలస్యం చెయ్యకు. పిల్లల్ని సెలవుల్లో మా ఇంటికి పంపించు. రవి చంద్రని జాగ్రత్తగా పెంచు.”

కన్నీళ్ళతో సెలవు తీసుకున్నది రుక్మిణి.


అనసూయ, ప్రకాశరావు స్టేషను కొచ్చి, మాధవరావుకు ధైర్యం చెప్పి, బాధగా వీడ్కోలు ఇచ్చారు. భారంగా ఆ వూరిని వదిలిపెట్టింది రైలు.

*

కాలగమనంలో నాలుగేళ్ళు గడిచిపోయాయి. భూమి గుండ్రంగా వుందనటానికి నిదర్శనంగా మాధవరావుకు మళ్ళీ సొంత వూరే ట్రాన్స్‌ఫరయింది.

ఇంట్లో అద్దెకున్న వాళ్ళు వేరే ఇల్లు చూసుకొని వెళ్ళటానికి రెండు మూడు రోజుల వ్యవధి అడిగారు. అనసూయ బలవంతంమీద వాళ్ళింట్లో వుండక తప్పలేదు—రుక్మిణీ, మాధవరావు.

ప్రకాశరావు ఉద్యోగం మానేసి బిజినెస్ మొదలు పెట్టాడు.




రవిచంద్ర తర్వాత మళ్ళీ ఆడపిల్ల పుట్టింది అనసూయకు.

డాక్టరు తిట్టి, కోప్పడి, మళ్ళీ కాన్పువస్తే బ్రతకవని చెప్పటంతో తప్పనిసరిగా ఆపరేషన్ చేయించుకుంది అనసూయ.

అడుగుపెడ్తూనే అడిగింది రుక్మిణి: "రవి చంద్రేడి?"

"పెరట్లో ఆడుకుంటున్నాడు. ఒరేయ్ రవీ! ఒకసారిటు రా!" కేకవేసింది అనసూయ.

"ఎందుకమ్మా పిలిచావు?" తల్లి దగ్గరకు వచ్చి ముద్దు ముద్దుగా అడిగాడు రవి.

"ఇలారా! ఎవరొచ్చారో చూడు!"

సిగ్గుపడుతూ తల్లిదగ్గరే నుంచున్నాడు రవి.

"ఏరా! నన్ను చూస్తే కొత్తగా వుందా? నేను....నేనురా! చిన్నప్పుడు నిన్నెత్తుకున్నాను. గుర్తు లేదూ?" రవిని చూడగానే మనసు ఉప్పొంగింది రుక్మిణికి.

ఆనందబాష్పాలు తుడుచుకుంటూ అన్నది: "బాగా పొడుగెదిగాడు. యు. కె. జీలో చేరాడా?"

"రవీ! చెప్పు. అలా సిగ్గుపడతావేం? ఆంటీకి ఏం చదువుకుంటున్నావో చెప్పు."

'ఆంటీనా!....నేను కేవలం ఆంటీనే అవుతానా? కన్నతల్లి ఆస్పత్రిలో వున్నప్పుడు కళ్ళల్లో పెట్టుకొని పెంచినందుకు నేను కనీసం పెంపుడు తల్లిని కూడా కానా?' మనసు చివుక్కుమంది రుక్మిణికి.

"ఫస్ట్ స్టాండర్డ్‌లోకి వచ్చాను!" ముద్దుగా చెప్పాడు.

"రవీ! ఇటురా! ఒక్కసారి నా దగ్గరకు రా!" చేయి చాపింది రవి వైపు.

రానన్నట్లు అడ్డంగా తలూపాడు.

"రావూ? ఎందుకు రావురా?" అంటూ ఒక్క ఉదుటున రవి నెత్తుకున్నది రుక్మిణి.

అనుకోని ఈ సంఘటనకు రవి భయపడి ఏడుపు ప్రారంభించాడు.

"వాడిని దించు రుక్మిణీ! భయపడుతున్నాడు. ఇంకా కొత్త కదా! రెండ్రోజులు పోతే దగ్గరికి వస్తాడు."

వెంటనే రవిని క్రిందకు దింపింది రుక్మిణి. "రవిచంద్రా! నన్ను చూసి భయపడుతున్నావా? నేను నీకు గుర్తులేనూ?" నీరసంగా అడిగింది.

"ఏమిటి నీ పిచ్చి రుక్మిణీ! వాడికి నువ్వెలా గుర్తుంటావు? నెలల పిల్లాడప్పుడు వెళ్లిపోయావు. నాలుగేళ్ళ తర్వాత తిరిగి వచ్చావు. ఒక్క నాలుగు రోజులు ఓపిక పట్టు. ఆంటీ, ఆంటీ అని నిన్ను క్షణం వదలడు!" రవి నుదుటి మీద ముద్దు పెట్టుకుంటూ అన్నది అనసూయ.

'ఆంటీ....ఆంటీ అని కాదు-అమ్మా, అమ్మా అని పిలవాలి.' ఆక్రోశించింది రుక్మిణి హృదయం.

*

మంచిరోజు చూసి సొంత ఇంట్లోకి వెళ్లిపోయారు మాధవరావు దంపతులు.

ఈ నాలుగు రోజుల్లోనూ రవిని కొంచెం అలవాటు చేసుకున్నది రుక్మిణి.

రుక్మిణిలో దాగి వున్న మాతృప్రేమని గుర్తించాడు మాధవరావు.

రాత్రి భోజనాలయ్యాక నవలొకటి చదువుతూ కూర్చున్నది రుక్మిణి.

పేపర్ మడుస్తూ "రుక్మిణీ! నీతో ఒక విషయం మాట్లాడాలి!" అన్నాడు మాధవరావు.

"ఏమిటది?"

"నీకు ఎవర్నైనా దత్తత చేసుకోవాలని వున్నదా?" సూటిగా అడిగాడు అతను.

"నాకలాంటి ఆలోచన ఇంతవరకూ రానే లేదు. మీరెప్పుడు అనుకున్నారు ఈ మాట?" భర్త వంక ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది ఆమె.

"నాకెందుకో అలా అనిపించింది. మనిషిగా పుట్టినందుకు ఏదో ఒక మంచి పని చేశామన్న సంతృప్తి కలగాలి కదా! అందుకని...ఎవర్నైనా మంచి పిల్లాడిని చూసి....అంటే నా ఉద్దేశంలో ఆరోగ్యంగా వున్న అబ్బాయిని పెంచుకుందామని వున్నది. నువ్వు ఏమంటావు?" కుతూహలంగా చూశాడు రుక్మిణివంక.

"మీ ఇష్టం!" ముభావంగా అనేసి పుస్తకంలోకి తల దూర్చింది ఆమె.

'నీవు తల్లివి కాలేవు. నా వంశాన్ని వృద్ధిలోకి తేలేవు. కనీసం ఎవరైనా దత్తత చేసుకొని ఇంటి పేరు నిలుపుకుంటాను' అని అతను చెప్పలేక చెప్పినట్లు అనిపించింది రుక్మిణికి.

'జనాభా లెక్కకి తప్పితే నేను బ్రతికున్నందు వల్ల ఏమిటి ప్రయోజనం?' ఉప్పెనలాగా దుఃఖం ముంచుకు వచ్చింది ఆమెకు.

"అరెరె! రుక్మిణీ ఎందుకు ఏడుస్తున్నావు? ఇప్పుడు నేనన్న మాటల్లో ఏదైనా తప్పుందా? నీకు బాధ కలిగించే పనేదీ చెయ్యను. సరేనా? ఏడవకు....ప్లీజ్! ఏడవకమ్మా!" మాధవరావు లాలనగా అన్నాడు.

అతని బుజ్జగింపుతో రుక్మిణి దుఃఖం మరింత ఎక్కువయింది.

"ఏడవకుండా చెప్పు. నీకు దత్తత ఇష్టం లేదా?"

మాట్లాడలేదు రుక్మిణి. వెక్కి వెక్కి ఏడుస్తున్న రుక్మిణిని చూసిన మాధవరావు కళ్ళల్లో నీరు తిరిగింది.

"నిన్ను కించపరచాలని నేననలేదు రుక్మిణీ! దత్తత ఇష్టం లేకపోతే మానేద్దాము. దానికింత ఏడుపెందుకు? పిచ్చి పిల్లా! లే....లే....అనవసరంగా ఏడిపించాను. సారీ!"

"మీరే నన్ను క్షమించాలి. మిమ్మల్ని తండ్రిని చెయ్యలేకపోయాను."

"ఎందుకోయ్ ఇంత చిన్నవిషయానికి అంత బాధ? మనం ఎవరికీ ఋణం లేము, మనకు ఎవరూ ఋణం లేరని సంతోషించక. నా మటుకు నేను హాయిగానే వున్నాను. చూడు రుక్మిణీ! 'ఋణానుబంధ రూపేణ పశుపత్నీ సుతాలయాః' అన్నారు పెద్దలు. చెప్పింది పురుషుడు కాబట్టి 'పత్నీ' అన్నాడేమో? అదే స్త్రీ నోట్లోంచి వస్తే 'పశుపతీ సుతాలయాః' అనేదేమో! ఏదైనా మనం అనుకోవటాన్నిబట్టీ, అర్థం చేసుకోవటాన్ని బట్టీ వుంటుంది. మన ఇద్దరం ఒకరికొకరం ఋణపడి వున్నాము. ఈ ప్రపంచంలో నాకున్న బంధం నువ్వొక్కదానివే! నువ్వు సుఖంగా సంతోషంగా వుండాలని నా కోరిక. ఇంకెప్పుడూ ఏడవవు కదూ!" అతని కంఠం బొంగురుపోయింది.

చప్పున తలెత్తి చూసింది ఆమె.

తనకోసం బాధ పడ్తున్న భర్త కళ్ళల్లో ఆవేదన స్పష్టంగా కనిపించింది రుక్మిణికి.

"ఇప్పుడే కాదు. జీవితంలో ఇంకెప్పుడూ ఏడవకుండా వుండటానికే ప్రయత్నిస్తాను." అతని అరచేతిలో తన చేతిని వుంచి ఒట్టు పెడుతున్నట్లుగా అన్నది.

"థ్యాంక్స్!" రుక్మిణిని దగ్గరకు తీసుకుంటూ అన్నాడు మాధవరావు.

*

రెండు మూడు రోజులైనా భర్త దత్తత ప్రసంగం తీసుకురాకపోతే ఒకరోజు తనే కదిల్చింది. "ఎవర్ని దత్తత చేసుకుంటే బాగుంటుందంటారు? మీకు తెలిసినవాళ్ళ పిల్లలెవరైనా వున్నారా?"

గంభీరంగా మారిపోయాడు మాధవరావు.

"తల్లీ తండ్రి వున్న పిల్లాడ్ని దత్తత తీసుకోవటం అనవసరం.

"తల్లి ప్రేమ ఎలాంటిదో తెలియని అనాథ బాలుడిని పెంచుకుందామని వున్నది. నువ్వేమంటావు?" రుక్మిణి అభిప్రాయం కనుక్కోవటానికి కాస్సేపు ఆగాడు. రుక్మిణి మాట్లాడలేదు.

"తల్లీ తండ్రి తెలియని పిల్లాడయితేనే నయం కదూ! మనల్ని తల్లిదండ్రులుగా భావిస్తాడు.

వాడ్ని పెంచి పెద్ద చేసి మంచి చదువు చెప్పించి ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దగల్గితేచాలు. అంత కంటె మన జీవితాలకు సార్థకత వుంటుందని నేననుకోను. అసలు మనమే కాదు .... ఏ కన్న వాళ్ళయినా కోరుకొనేది అదే! ఏమంటావు రుక్మిణీ, నీ అభిప్రాయ మేమిటో చెప్పు."

"నాకు అనాథ పిల్లల్ని పోషించాలని కోరిక లేదు. నాకున్న ఒకే ఒక కోరిక రవిచంద్ర చేత 'అమ్మా' అని పిలిపించుకోవటం. నాకు రవిని పెంచుకోవాలని వున్నది. మీ కిష్టమేనా?" తన మనసులో మాట చెప్పింది రుక్మిణి.

"నా ఇష్టం తర్వాత చెప్తాను. ముందు మీ అనసూయ అంగీకరిస్తుందా? ఆయన ఒప్పు కుంటారా?" అనుమానంగా అడిగాడు.

"ముందు మీరు ఊఁ అనండి. నేను వాళ్ళని ఒప్పిస్తాను!" దృఢంగా అన్నది రుక్మిణి.

"నేను వేరే అనటం ఎందుకు? పెంచేదానివి నువ్వు. మనం పెంచినందుకు వాడు వృద్ధిలోకి వచ్చి మంచి పేరు తెచ్చుకుంటే చాలు!" అంగీకా రంగా అన్నాడు అతను.

"అయితే రేపే వెళ్ళి అనసూయని అడుగు తాను. అడిగి రమ్మంటారా?"

"వెళ్ళగానే....రవిచంద్రని ఇచ్చేయి....నేను పెంచుతాను అనకుండా....మేము ఎవర్నైనా దత్తత చేసుకుందా మనుకుంటున్నాము. నీ అభి ప్రాయ మేమిటని నెమ్మదిగా అడుగు. సమాధానం ఏం చెబుతుందో చూసి అప్పుడు నీ కోరిక బయట పెట్టు. ప్రకాశరావుగార్ని కూడా కనుక్కొని రెండు మూడు రోజుల్లో ఏ సంగతీ చెప్పమను. తెలిసిందా ఎలా మాట్లాడాలో?" తెలిసిందన్నట్లు తలూపింది రుక్మిణి.

"ఇంక అన్నం పెట్టు. అప్పుడే తొమ్మి దయింది!" అన్నాడు మాధవరావు.

మాధవరావుకు పెట్టి తనూ వడ్డించుకున్నది రుక్మిణి. కాని....ముద్ద దిగలేదు. మంచినీళ్ళతో కూర అన్నం మింగింది. మాధవరావు లేచి వక్కపొడి వేసుకుంటూ అన్నాడు: "రేపు అడిగే దానికి ఇప్పట్నించే ఆలోచనా? కంచంలో అన్నం కదల్లేదు. ముందు అన్నం తిను....తర్వాత నిద్ర పోకుండా ఆలోచించచ్చు."

కంచంలో చేయి కడిగేసుకొని లేచింది రుక్మిణి.

మాధవరావు అన్నట్లు ఆమెకు నిద్రపట్టలేదు.

'దత్తత విషయం చెప్పగానే అనసూయ ఏమంటుందో? ముందు ఆశ్చర్యపోతుంది. తర్వాత ఆనందిస్తుంది. కాని....రవిచంద్రని ఇవ్వటానికి ఒప్పుకుంటుందా? అనసూయ ఒప్పుకున్నా ప్రకాశ రావు ఏమంటాడో? రవిచంద్రని కాకుండా ఇంకె వర్నీ పెంచుకోవటానికి మనసొప్పటం లేదు. ఉంగరాలు తిరిగి ముఖం మీదకు పడే ఆ జుట్టూ, నల్లటి పెద్ద కళ్ళూ, నవ్వితే సొట్టలుపడే ఆ పాల బుగ్గలు....ఎంత బాగుంటాడో' అనుకుంది రుక్మిణి.

'దేవుడి దయవల్ల అనసూయ ఒప్పుకుంటే బాగుండును. రవిచంద్రని నా ప్రాణం కంటె ఎక్కువగా చూసుకుంటాను!' అనుకుని భగ వంతుడి మీద భారం వేసి పడుకున్నది రుక్మిణి.

మాధవరావు ఆఫీసులో ఈ విషయం చెప్పి నప్పుడు చాలామంది ఆశ్చర్యపడ్డారు. "కంటే ఖర్మం గాని పెంచుకోవటం ప్రారబ్ధం గదా!





సుందరీ మందిరం

మొహం అంద వికారంగా వుంటే—ఏం చెయ్యాలి? "దేవుడు మనకి అందం ఇవ్వలేదు—ఏం చేస్తాం" అనుకుంటూ కూచునే రోజులు పోయాయి. అదెక్కడో 'మహర్జలం' వుండేదిట. అంద వికారులు ఆ నీళ్ళతో మొహం కడుక్కుంటే, సౌందర్యవంతులు అయ్యేవారుట! ఇలాటి కథల్ని మనం ఎన్నో చదివాం. "అలాంటివన్నీ కథల్లోనే జరుగుతాయి—అని ఇప్పుడు మనం అనుకోనక్కర్లేదు," అంటారు మాస్కోలోని 'ఇన్‌స్టిట్యూట్ అఫ్ కాస్మటాలజీ' నిర్వాహకులు. మొహం ఎంత వికారంగా వున్నా, దాన్ని వాళ్ళు 'అతి సుందరం'గా తయారు చేస్తున్నారు. కొందరి మొహాల మీద మచ్చలుంటాయి: కొందరి ముక్కు బాగుండకపోవచ్చు: కొందరి పెదవులు పెద్దవిగా వుండొచ్చు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ఇలాంటివెన్నో సరిచేస్తున్నారు. ఆధునిక విధానాలతో ఎందరో శాస్త్రజ్ఞులు, శస్త్ర చికిత్సా నిపుణులూ ఈ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్నారు. ఈ ఇన్‌స్టిట్యూట్ ఎన్నోరకాల సౌందర్య సాధనాలను కూడా తయారు చేస్తున్నది. ఈ విధంగా అక్కడి ఈ 'సుందరీ మందిరం' ఎందర్నో ఆకర్షిస్తున్నది.

ఎందుకోయ్ !'' అన్నారు కొంతమంది. కొంత మంది ''నిజమే! ఎవరో ఒకరు ఇంట్లో తిరుగుతూ వుంటే మీ మిసెస్‌కి సందడిగా వుంటుంది. మీకూ తృప్తిగా వుంటుంది!'' అన్నారు. మరి కొందరు ''ఫ్యామిలీలో పిల్లాడ్ని తీసుకుంటారా? అనాథ శరణాలయంలో చూస్తారా? లేకపోతే ఎవరినయినా నిర్ణయించుకున్నారా?'' అని అడిగారు.

''ఇంకా ఎవర్నీ నిర్ణయించుకోలేదు. రాత్రే అనుకున్నాము. తల్లినీ తండ్రినీ గుర్తు పట్టని పిల్లాడయితే మంచిదనుకుంటున్నాను'' అన్నాడు మాధవరావు. అన్నీ ఆరాలు తీసే ఓ అయిదారుగురు మాత్రం అన్నీ వివరాలు అడిగారు.

''ఎన్నేళ్ళ పిల్లాడు కావాలి? ఏ రంగులో వుండాలి? మాటలు వచ్చినవాడు కావాలా? మధ్య తరగతి కుటుంబంలోంచి కావాలా? పేదరికంలో వున్న వాడిని తీసుకుంటారా?'' వాళ్ళ ప్రశ్న మీద ప్రశ్న వేస్తుంటే ఓపిగ్గా జవాబిచ్చాడు మాధవరావు. మధ్యాహ్నం రెండు గంటలకి కాఫీ చేసుకొని త్రాగి మాధవరావు కోసం ఫ్లాస్కులో పోసుంచి ఇంటికి తాళం వేసి బయల్దేరింది రుక్మిణి.

ఉదయం లేచిన దగ్గర్నుంచి మనసు రవిచంద్ర చుట్టే తిరుగుతున్నది. అనసూయ అంగీకరించేదాకా అనుమానమే! తర్వాత ఆమె భర్త 'ఊఁ' అనే దాకా సందేహమే: ఆయనకసలు పిల్లలంటే వెర్రి ప్రేమ. 'నో' అనేస్తాడేమో? వాళ్ళకు ఏ విధమైన ఆర్థిక ఇబ్బందీ లేదు. మరి ఏ కారణంగా దత్తత ఇస్తారు?

కాకిపిల్ల కాకికి ముద్దు అని బిడ్డలపట్ల తల్లితండ్రుల ప్రేమ ఒకటే కదా! దానిలో పేదవారనీ పెద్దవారనీ తేడాలేం లేవు.

ధనవంతులైనా పేదవారైనా కూడా తమ పిల్లలు పెద్దవాళ్ళయి తమకు అండగా నిలవాలనే ఆశిస్తారు.

''ధరణికి గిరి భారమా!....కనిపెంచే తల్లికి పిల్ల భారమా!''

అనుకోకుండా ఆ చరణం గుర్తుకొచ్చి గుండె బరువెక్కింది రుక్మిణికి.

*

ఎప్పటిలా చనువుగా కాకుండా భయంభయంగా అనసూయ ఇంట్లోకి అడుగు పెట్టింది రుక్మిణి. 'అనసూయా!' నెమ్మదిగా పిల్చింది. తన గొంతు తనకే కొత్తగా వినిపించింది రుక్మిణికి.

'అనసూయా!' గొంతు సవరించుకొని కొంచెం గట్టిగా పిల్చింది రుక్మిణి.

''ఆఁ వస్తున్నా! ఎవరూ? ఏమిటీ అక్కడే నిలబడ్డావ్ పరాయిదానిలాగా? లోపలికి రా!'' స్నేహితురాలి చెయ్యి పట్టుకొని తీసుకువెళ్ళింది అనసూయ.

''ఏమిటీ విశేషం? ఈ మధ్య అసలు రావటం మానేశావు? రవి రెండుమూడుసార్లు అడిగాడు. ఆంటీ వాళ్ళింటికి తీసుకెళ్ళమని....'' కబుర్లు చెబుతూ మంచినీళ్ళు ఇచ్చింది.

''ఆఁ నువెందుకు వస్తావులే; రవిని పనివాడి చేతికయినా ఇచ్చి పంపాల్సింది.'' నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ అన్నది రుక్మిణి.

''మా పిన్నత్తగారూ వాళ్ళు వచ్చి వెళ్ళారు. రావటానికి కుదరలేదు. పనివాడికి బజారు పనితోనే సరిపోయింది. ఏమిటో చూస్తుండగానే సంసారం పెరిగి పెద్దదయింది. ఇందులో పడి కొట్టుకుపోతున్నాను. బయట ప్రపంచంతో సంబంధం లేకుండా పోయింది. ఎలావున్నారు మీ వారు? నువ్వెలా వున్నావు?'' పూరీల పిండి కలుపుతూ అడిగింది అనసూయ.

''నువ్వు చేస్తున్నావేమిటి ఈ పనంతా— వంటావిడేది?''

''అమ్మకి ఒంట్లో బాగుండలేదు. వంటావిడని అక్కడికి పంపించాను.''

''కూర్చో! ముందు కూర చేస్తాను. తర్వాత పూరీలు వత్తచ్చు.'' బంగళాదుంపలు తరుగుతూ అన్నది అనసూయ.

''నేనొక సంగతి చెబుతామని వచ్చాను!'' ఉల్లిపాయ పొట్టు తీస్తూ అన్నది రుక్మిణి.

''ఏమిటది?'' కుతూహలంగా అడిగింది అనసూయ తలెత్తి.

''ఎవర్నైనా దత్తత చేసుకుందామన్నారు మావారు....''

''నేనెప్పుడో చెబుదామనుకున్నాను కానీ.... నువ్వేమనుకుంటావో అని సంకోచించాను!'' రుక్మిణి మాటలకు అడ్డు తగులుతూ అన్నది అనసూయ.

''అయితే నీ ఉద్దేశం కూడా అదేనంటావా?'' మెల్లగా అన్నది రుక్మిణి.

''అవును రుక్మిణీ! ఎవర్నో ఒకర్ని పెంచుకున్నంత మాత్రాన పుట్టే పిల్లలు పుట్టక మానారా? దత్తత చేసుకున్నవేళ మంచిదయితే....నీకు వెంటనే కాన్పు కూడా వస్తుంది. అప్పుడు నువ్వు పెంచుకున్న పిల్లవాడి మీద సవతితల్లి ప్రేమ చూపించకుండా వుండాలి. అయినా నువ్వలాంటి దానివి కాదులే! నీకు ప్రేమించే హృదయముంది. అందర్నీ సమానంగానే చూస్తావు!'' తనకు తానే సమాధానం చెప్పుకుంటూ కూర తరిగింది అనసూయ.

అనసూయ తన మీద మంచి అభిప్రాయం వెలిబుచ్చినందుకు సంతోషించింది రుక్మిణి.

''నీకు సవతితల్లుల మీద సదభిప్రాయం వున్నట్లు లేదే? అందరూ ఒకేలా వుంటారా అనసూయా!''

''నా అభిప్రాయాలకేం గానీ .... ఎవర్ని పెంచుకోవాలనుకుంటున్నావో చెప్పు.''

''చెప్పనా?'' గుండె దడదడలాడింది రుక్మిణికి.

''అయితే ఎవర్ని దత్తత చేసుకోవాలో గూడా నిర్ణయించుకున్నారన్నమాట!'' కొంచెం నిష్ఠూరంగా అన్నది అనసూయ.

''నేననుకున్నాను గాని-ఇంకా వాళ్ళను అడగలేదు. తీరా అడిగాక జవాబు ఎలాంటిది వినాల్సి వస్తుందోనని భయంగా వున్నది.''

''నీవంటి ప్రేమమూర్తికి పిల్లాడిని ఇవ్వటానికి ఎవ్వరూ సందేహించరు రుక్మిణీ! త్వరగా వాళ్ళని అడిగి ఏ సంగతీ తేల్చుకో! ముందు ఆ తల్లితండ్రులెవరో చెప్పు!'' ఆత్రంగా అడిగింది అనసూయ.

''నువ్వే అనసూయా! నువ్వే నాకు పుత్రభిక్ష పెట్టాలి!'' గబగబా అనేసింది రుక్మిణి.

ముందు రుక్మిణి చెబుతున్నదేమిటో అర్థం కాలేదు అనసూయకు.

''ఏమిటి రుక్మిణీ! నువ్వేమంటున్నావు?'' అయోమయంగా అన్నది అనసూయ.

''అవును అనసూయా! నాకు రవిచంద్రని దత్తత చేసుకోవాలని వున్నది. వాడిచేత 'అమ్మా!' అని పిలిపించుకోవాలని వున్నది. నీకిష్టమేనా? మీవారొప్పుకుంటారా?'' ఆత్రంగా అడిగింది రుక్మిణి.

'నా ఎదురుగానే రవి, రుక్మిణిని అమ్మా అని పిలవటం నేను భరించగలనా? వాడు అమ్మా అంటే నా తల్లిపేగు కదలదా? ఇన్నాళ్ళూ నా కళ్ళముందున్నవాడు ఇప్పుడు కనుమరుగవుతే

నేను భరించగలనా?' ఆందోళనపడింది అనసూయ అమ్మ మనసు.

"త్వరగా జవాబు చెప్పు అనసూయా! రవి చంద్రని మాకివ్వటం నీకిష్టం లేదా?" అనసూయ భుజాలు పట్టుకొని కుదుపుతూ అడిగింది రుక్మిణి.

"నా ఇష్టమేముంది? మావార్ని అడగాలి. ఆయనొప్పుకోవాలి."

మౌనంగా వున్న స్నేహితురాలి ముందు కూర్చోలేక పెరట్లోకి వెళ్ళి జామచెట్టు నీడన కూర్చుంది రుక్మిణి.

'నీకు దత్తత ఇవ్వటానికి ఎవరైనా ముందుకు వస్తారు. నీవు ప్రేమ మూర్తివి, మంచి దానివి అంటూ కబుర్లు చెప్పిన అనసూయ తన పిల్లాడ్ని ఇవ్వటానికి సందేహిస్తున్నది. చిన్నప్పటినుంచీ నా స్వభావం తెలిసిన తనే వెనుకంజ వేస్తే.... ముక్కూ, ముఖం తెలియని వాళ్ళు తనకు తమ పిల్లవాడిని పెంచుకోమని ఎలా ఇస్తారు?'

ఆలోచనల ప్రవాహంలో కన్నీరు వరదయింది రుక్మిణికి.

'ఒంట్లో బాగుండక కొంచెం త్వరగా ఇంటి కొచ్చిన ప్రకాశరావు కాళ్ళు కడుక్కుందామని పెరట్లోకి వెళ్ళాడు.

కారుతున్న కన్నీటిని లెక్కచెయ్యక శూన్యం లోకి చూస్తూ కూర్చున్న రుక్మిణిని చూసి కంగారు పడ్డాడు అతను. "ఏమిటి అనసూయా! మీ రుక్మిణి అలా వున్నదేం?" గాభరాగా అడిగాడు వంటింట్లోకి వచ్చి.

"మీ రెప్పుడొచ్చారు ఆఫీస్ నుంచి?" ఆశ్చర్యంగా అడిగింది అనసూయ.

"ఇప్పుడే వచ్చాను కాని....రుక్మిణి ఏడుస్తున్న దెందుకు? నువ్వేమన్నా అన్నావా?"

'రుక్మిణి ఏడుస్తున్నదా? ఈ పూరీల గొడవలో పడి మళ్ళీ దాని సంగతే మర్చిపోయాను. పిచ్చిపిల్ల! నేనే అనవసరంగా ఏడ్పించాను' అనుకుంటూ రుక్మిణి దగ్గరకు పరుగున వెళ్ళింది అనసూయ.

"రుక్మిణీ! లోపలికి రామ్మా! ఒక్కదానివి ఇక్కడ కూర్చున్నావేం? రామ్మా రా! ఆయన కూడా వచ్చారు. పిలుస్తున్నారు రా!" రుక్మిణిని లేవదీసింది.

"మా వార్ని నువ్వే అడుగు. ఏమంటారో?" నెమ్మదిగా అన్నది అనసూయ. [సశేషం]

# విద్యార్థినుల రచనలు

*

## వ్యామోహ తరం

బొమ్మలాంటి ఒక సుందరి
కమ్మని చిరునవ్వొకటి విసిరి
తెమ్మని ఏదయినా అడిగితే
కిమ్మనకుండా సమకూర్చితే
అవుతుంది అదే గొప్పవరం
అనుకొనే ఈ వ్యామోహ తరం
కళ్ళులేని ఒక వనిత
తల్లిలాంటి ఒక పునీత
అయ్యా ధర్మం చెయ్యండని
అడిగితే అంటారు ముష్టి ముండని!

—అరుణ

[బి. ఎ. ఫైనల్ ఇయర్
ప్రభుత్వ కళాశాల,
జగిత్యాల]

*

## గోరంత దీపం

ఒక దీపం వెలిగింది
మనసెంతో మురిసింది,
ఏనాటి నుండో ఎదురు చూచిన కాంతి
జగతినే నింపింది.

మిణుకు మిణుకుమనే
ఈ దీపం
చెణుకులీనుతూ
వెలిగింది

వెలవెలబోయే
నా జీవితాన్ని
మిలమిలలాడించింది

ఏనాటినుండో ఎదురు చూసిన ఆనందం,
మదినిండా నింపింది,
హృదయాన్నే వెలిగించింది.

నిశ్చలంగా నిలుచుందీ ఈ దీపం ఈ నాడు
కర్కశంగా వేధించెను మనస్తాపమానాడు

ఆ నాడు—
చమురు లేని ప్రమిదలో
వత్తి వెలగనన్నది

మోడువారిన జీవితాన
ఆశ మెదలనన్నది

ఏనాటినుండో అనుభవిస్తున్నాను ఈ తాపం
ఈనాటినుండీ తీరింది ఈ శాపం

నా దీపం వెలిగింది వెలుగెంతో నింపింది
బండబారిన బ్రతుకుకు అండగా నిలిచింది
బ్రతుకంతా మెరిసింది వెలుగులతో నిండింది
గోరంత దీపం కొండంతై వెలిగింది.

—'ప్రభు' (కలం పేరు)

(బి. ఎస్‌సి. విద్యార్థిని, యస్. ఐ. ఇ. టి. కళాశాల, మద్రాసు)

# 4

సిగ్గుపడింది రుక్మిణి. దుఃఖాన్ని అదుపు చెయ్యలేనందుకు....

తల వంచుకొని మెల్లగా అనసూయ వెంట వంటింట్లోకి వెళ్ళింది.

అక్కడ డైనింగ్ ఛెయిర్‌లో కూర్చుని టిఫిన్ తింటున్నాడు ప్రకాశరావు.

"ఏమ్మా! ఎలా వున్నారు? మాధవరావుగారు కులాసాగా వున్నారా?"

లోపల బాధను దాచుకొని, పైకి నవ్వుతూ వుండే రుక్మిణంటే అతనికి అభిమానం.

"కులాసాగానే వున్నామండీ!" అంటుంటే రుక్మిణి గొంతుకు వెక్కిళ్ళు అడ్డుపడ్డాయి.

"ఎందుకమ్మా రుక్మిణీ! దేనికో బాధ పడ్తున్నట్లున్నావు?" ఆదరంగా అడిగాడు అతను.



అతని అభిమానానికి రుక్మిణి కళ్ళు చెమ్మగిల్లాయి మళ్ళీ.

చెప్పమన్నట్లుగా రుక్మిణి చెయ్యి నొక్కింది అనసూయ.

"మాకు రవిచంద్రని పెంచుకోవాలని వున్నదండి. మీ కిష్టమైతే...." సగంలో ఆపేసింది. అతడు నోట్లో పెట్టుకోబోతున్న పూరీని ప్లేట్లో వదిలేశాడు.

"ఇలా అడిగానని మీరేమీ అనుకోవద్దు. మీకు కష్టం కలిగించి ఉంటే నన్ను క్షమించాలి!"

వెంటనే జవాబివ్వలేదు అతను.

"నువ్వు వాడిని వదిలి వుండగలవా?" ఎదురు ప్రశ్న వేశాడు అతను.

సమాధానం చెప్పలేక పోయింది ఆమె.

"ఇద్దరు మొగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలే నీకు పుట్టారనుకోగలవా? రవిని మర్చిపోగలవా?" అతనలా అంటుంటే వినలేక చెవులు మూసుకున్నది అనసూయ.

"ఊహనే భరించలేని దానివి.... వాస్తవాన్ని అనుభవించ గలవా?"

## పెద్దకథ: అమ్మ

### ఉండవల్లి జయశ్రీ

గబగబా అనేసి 'నేను వెళ్ళొస్తాను అనసూయా!' అని, మరో మాటకి అవకాశం ఇవ్వకుండా వాకిట్లోకి నడిచింది రుక్మిణి.

"రుక్మిణీ! కొంచెం ఆగు. ఈ టిఫిన్ తిని వెళ్ళు." వెనకనించి అనసూయ అరుస్తున్నా వినకుండా ఇంటిదారి పట్టింది రుక్మిణి.

ఆ రాత్రి మాధవరావు అడిగాడు. "అనసూయా వాళ్ళింటికి వెళ్ళొచ్చావా? రవిచంద్ర విషయం అడిగావా?"

"వెళ్ళాను. అడిగాను. వాళ్ళింకా ఏం చెప్పలేదు. అసలెప్పటికైనా చెప్తారో లేదో తెలియదు....." మరో మాట మాట్లాడాల్సింది ఏమీ లేదన్నట్లుగా దుప్పటి కప్పేసుకుంది ఆమె.

'ప్రకాశరావుగారు వున్నారా?' అన్న మాధవరావు ప్రశ్నకు 'ఆ' అని దుప్పట్లోంచే జవాబిచ్చింది రుక్మిణి.

*

అనసూయ ప్రకాశరావుని అడిగింది. "ఏమంటారు? రవిని రుక్మిణికి ఇద్దామంటారా?"

"మరెలాగండీ? అది ఎంతో బాధపడుతున్నది. నన్నేం చెయ్యమంటారు? రుక్మిణికి ఏం జవాబు చెప్పమంటారు?" భారమంతా అతనికే వదిలేసింది ఆమె.

"నిజంగా రుక్మిణిని చూస్తుంటే జాలివేస్తున్నది. చూస్తూచూస్తూ రవిని పరాయి ఇంటి బిడ్డని చెయ్యలేము. ఏం చెయ్యాలో నాకూ ఏమీ తోచటం లేదు. తల నొప్పిగా వుంది. ముందు కొంచెం మందురాయి. తర్వాత ఆలోచిద్దాము..." అని అతను కళ్ళుమూసుకు పడుకున్నాడు.

అతని నుదుటికి మందు రాస్తూ మెల్లగా అన్నది అనసూయ: "ఏదో ఒకటి త్వరగా ఆలోచించండి. రుక్మిణికి దిగులు ఎక్కువైపోతున్నది."

"రవిని పెంచే విషయంలో ఆవిడ నీ కంటె ఎక్కువగానే చూస్తుంది. చేస్తుంది. అందులో సందేహం లేదు." సాలోచనగా అన్నాడు అతను.

"నా కంటే ఏమిటి? తన ప్రాణం కంటె ఎక్కువగా చూసుకుంటుంది రవిని. మనం ఇప్పుడు బాధపడాల్సింది....భయపడాల్సింది 'రవిని వదిలి మనం వుండగలమా? రవి మన కోసం బెంగపెట్టుకోకుండా వుంటాడా?' అని. ఏమంటారు?"

"నువ్వు కూడా మనస్ఫూర్తిగా ఇష్టపడితే రవిని దత్తత ఇవ్వటానికి నాకేం అభ్యంతరం లేదు అనసూయా!" చివరికి తేల్చి చెప్పాడు ప్రకాశరావు.

కళ్ళు మూసుకు పడుకుంటే రుక్మిణి దీన వదనమే మళ్ళీమళ్ళీ గుర్తుగు వస్తుంటే అతను భరించలేకపోయాడు. నిద్రపోలేకపోయాడు.

అనసూయను లేపి ఆ మాట చెప్పిన తర్వాత అతను తృప్తిగా నిద్రపోయాడు. ఆ క్షణం నుంచీ మళ్ళీ నిద్రపట్టలేదు అనసూయకు.

"నాకే పరీక్ష ఎదురయిందేమిటి? ఒక పక్క ప్రాణ స్నేహితురాలు. మరోపక్క కన్నకొడుకు. నాకు ఇద్దరూ కావాలి. ఇద్దరి సుఖ సంతోషాలూ కావాలి. నన్నేం చెయ్యమంటావు భగవాన్! కాదని రుక్మిణి బాధను చూడలేను. అవునని రవికి దూరంగా వుండలేను. నాకేది దారి? నాచేత నువ్వేం చేయించదలిచావో తండ్రీ! నీకే తెలియాలి." ఎదురుగా వున్న దేవుడికి నమస్కరిస్తూ అనుకున్నది అనసూయ.

తెల్లవారి లేస్తూనే రవిని అడిగింది.

"ఆంటీ వాళ్ళింటికి వెళ్తావా రవీ? ఆంటీ అంటే నీకిష్టమేనా?" వాడిని పరీక్షగా చూస్తూ అన్నది.

"ఓ! ఆంటీ అంటే నాకు చాలా ఇష్టం. బోలెడన్ని స్వీట్లు పెడ్తుంది. బొమ్మలు కొని పెడ్తుంది. వెళ్తాను. ఎప్పుడు వెళ్ళమంటావు అమ్మా!"

రవి ముద్దు మాటలకు నవ్వింది అనసూయ.

"ఎప్పటికీ అక్కడే వుంటావా?"

"నువ్వు కూడా వస్తావా?" తల్లిని అడిగాడు.

"నేను రాను. నువ్వు వాళ్ళింట్లో వుండి చదువుకోవాలి. వెళ్తావా?"

"ఎందుకమ్మా! మనింటికి బడి దగ్గరగానే వుందిగా! నువ్వు రాకపోతే ఆంటీ దగ్గరకు నే వెళ్ళను." అనసూయ చీర కుచ్చెళ్ళలో ముఖం దాచుకుంటూ అన్నాడు రవి.

చప్పున ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

"అలా అనకూడదు బాబూ! ఆంటీకి నువ్వంటే ఎంతో ఇష్టం. అంకుల్ కూడా

నిన్నెంతో బాగా చూస్తారు. వాళ్ళింటికి వెళ్తావా?'' తల నిమురుతూ అన్నది.

''నువ్వు వస్తే వెళ్తాను. లేకపోతే వెళ్ళనే వెళ్ళను.'' తల్లిని తప్పించుకుని తండ్రి దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ''నాన్నా! నాన్నా! తెల్లవారిపోయింది. ఇంక నిద్రపోగూడదులే!''

తండ్రిని తన చిట్టి చేతుల్తో తట్టి లేపుతూ అన్నాడు.

"బాబూ! నువ్వు ఆంటీ వాళ్లింట్లో ఉంటావా?" కళ్లు విప్పుతూనే అడిగాడు ప్రకాశరావు.

''ఎందుకు నాన్నా?''

''ఎందుకంటే....'' ఆ తరువాత ఏం చెప్పాలో తెలియక తల గోక్కున్నాడు అతను.

''ఆంటీకి, అంకుల్‌కి నువ్వంటే ఇష్టం. అందుకని వాళ్ళ దగ్గర కొన్ని రోజులుండిరా!''

''మరి అమ్మ కూడా వస్తుందా? చెల్లాయిని కూడా తీసుకెళ్ళనా?''

''నువ్వు ముందు వెళ్ళిపో! మేము తర్వాత వస్తాము. వాళ్ళు నీకు బోలెడన్ని బట్టలు కుట్టిస్తారు. ఎన్నో స్వీట్లు పెడతారు. మరి వెళ్తావా?''

''మీరందరూ ఎప్పుడు వస్తారు?''

''నువ్వు వెళ్ళగానే మేమూ వస్తాము. నువ్వు ఆంటీని అమ్మా అని, అంకుల్‌ని నాన్నా అని పిలవాలి....తెలిసిందా?'' ప్రకాశరావు గొంతు వణికింది.

''అలా ఎందుకు పిలవాలి నాన్నా? ఆంటీ అని ఎందుకు పిలవకూడదూ?''

ఆ పసివాడి ప్రశ్నలకు ప్రకాశరావు జవాబివ్వలేక పోయాడు. అప్పుడే అక్కడికి వచ్చిన అనసూయ అందుకున్నది.

''ఎవ్వరికీ ఏమీ కొనిపెట్టకుండా అన్నీ నీకే ఇస్తుందికదా ఆంటీ! నీకేది కావాలంటే అది కొని పెట్టుందికదా! అందుకని అమ్మా అని పిలవాలమ్మా! ఏం?'' బుజ్జగిస్తున్నట్లుగా అన్నది.

"నేను పిలవను!" తల ఎగరేస్తూ నిర్లక్ష్యంగా అన్నాడు రవి.

''ఎలాగండీ వీడితో? రుక్మిణికి ఏమని చెప్పాలి?''

'''రవిని మీకు దత్తత ఇవ్వటానికి మాకేం అభ్యంతరం లేదు. వాడు మిమ్మల్ని 'అమ్మా నాన్నా' అని పిలవటం మా చేతుల్లో లేనిపని. రవి ఎప్పటికైనా మిమ్మల్ని తల్లీ తండ్రిగా గుర్తిస్తాడనుకుంటే పెంచుకోండి. లేకపోతే నెలల పిల్లవాడిని తెచ్చుకోండి!' అని చెప్పు. వాళ్ళేమంటారో కనుక్కో!'' ప్రకాశరావు పక్క మీద నుంచి లేస్తూ అనసూయతో అన్నాడు.

*

ఆ సాయంత్రం రవిని తీసుకొని రుక్మిణి దగ్గరకు బయల్దేరింది అనసూయ. దిగులుగా శూన్యంలోకి చూస్తూ కూర్చున్న రుక్మిణిని చూడగానే అనసూయ మనసులో స్థిరనిశ్చయం కల్గింది. 'ప్రాణస్నేహితురాలికి మనశ్శాంతి కల్గించాను అన్న తృప్తినైనా మిగుల్చుకుంటాను' అనుకున్నది ఆమె అడుగు లోపలికి వేస్తూ.

''రుక్మిణీ!''

ఉలిక్కిపడి చూసింది రుక్మిణి.

''నేను రుక్మిణీ! అనసూయను వచ్చాను. ఏమిటలా చూస్తావు?'' భయంగా అన్నది.

"నువ్వు మళ్ళీ మా ఇంట్లో అడుగుపెడ్తావనుకోలేదు అనసూయా! నా తెలివి తక్కువ మాటల్ని పట్టించుకోకుండా వచ్చావు. నిన్నటి నా ప్రవర్తన నిన్ను చాలా బాధపెట్టి వుంటుంది. నన్ను క్షమించు!'' చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ అన్నది రుక్మిణి.

''ఏమిటా పిచ్చి — రుక్మిణీ? ప్రతి దానికి ఏడుపేనా? కన్నీరు చాలా విలువయింది. ముందు వెళ్ళి ముఖం కడుక్కురా! నీకో మంచి మాట చెప్పాలని వచ్చాను.'' ఊరిస్తున్నట్లుగా అన్నది అనసూయ.

''ఆ మంచి మాట ఏమిటో ముందు చెప్పు. తర్వాత తీరిగ్గా టాయ్‌లెట్ అవుతాను. నా ప్రాణం తియ్యక త్వరగా చెప్పు అనసూయా!" అనసూయ భుజంమీద చెయ్యివేసి అన్నది రుక్మిణి ఆదుర్దాగా.

''రవిని దత్తత ఇవ్వటానికి మావారు ఒప్పుకున్నారు....''

''నిజంగానా?'' అనసూయ మాట పూర్తి కాకుండానే మధ్యలో గట్టిగా అరిచింది రుక్మిణి. సమాధానం కోసం ఎదురు చూడకుండానే ''రవీ నా తండ్రీ! ఇన్నాళ్ళకి ఈ అమ్మ గుర్తుకొచ్చిందా? నీకేం కావాలో అడుగు....అన్నీ ఇస్తాను. కాని నన్ను విడిచి మటుకు ఎక్కడికీ వెళ్ళకు!'' అంటూ రవిని ఎత్తుకొని గిరగిరా తిప్పింది.

ఆ పిచ్చి ప్రేమకు ఆశ్చర్యపోయింది అనసూయ.

''అవును రుక్మిణీ! రవిని ఎప్పటికీ నీకు ఇవ్వటానికే మేము నిర్ణయించుకున్నాము. కాని.... వాడు అమ్మా నాన్నా అని మిమ్మల్ని పిలుస్తాడో లేదో?'' సందేహంగా అన్నది అనసూయ.

''ఆఁ ఎందుకు పిలవడు? వాడే పిలుస్తాడు. వద్దనేదాకా పిలుస్తాడు. ఏం నాన్నా! నన్ను అమ్మా అని పిలవ్వూ?'' రవి బుగ్గమీద ముద్దు పెట్టుకుంటూ అన్నది రుక్మిణి.

''ఊహుఁ నేను పిలవను!'' రవి కచ్చితంగా చెప్పాడు.

విలవిలలాడింది రుక్మిణి మనసు; తెల్లబోయినట్లు చూసింది అనసూయవంక.

''అమ్మా అని పిలవాలి రవీ! ప్రొద్దుట్నుంచీ నేను చెబుతున్నదంతా ఏమయింది?'' కోపంగా అన్నది అనసూయ.

''అమ్మా!'' అని పిలుస్తూ అనసూయ దగ్గరికి వెళ్ళాడు రవి.

"నన్నుకాదు....ఆంటీని అమ్మా అని పిలవాలి. వెళ్ళు ఆంటీ దగ్గర....ఆంటీకాదు–మీ అమ్మ దగ్గరకెళ్ళి కూర్చో!'' పళ్ళబిగువున దుఃఖాన్ని ఆపుకుంటూ రవిని పక్కకు నెట్టింది అనసూయ.

''నువ్వు మా అమ్మవి కావా అమ్మా?'' కళ్ళను పెద్దవి చేస్తూ ఆశ్చర్యంగా అడిగాడు రవి.

ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేక కిటికీ దగ్గరకు వెళ్ళి బయటకు చూస్తూ నిలబడింది అనసూయ.

''ఆంటీ! నిన్ను అమ్మా అని ఎందుకు పిలవాలి?'' రుక్మిణిని అడిగాడు.

సరైన సమాధానం, తృప్తి కల్గించే జవాబు చెబితే పిలవటానికి సిద్ధంగా వున్నట్లు నోరు తెరిచి రుక్మిణినే చూస్తూ నిలబడ్డాడు రవి.

'అవును....నిజమే....తన్నెందుకు పిలవాలి? తనేం నవమాసాలు మోయలేదే? స్త్రీకి పునర్జన్మ అనే కాన్పు కష్టం తనేం అనుభవించలేదే? పెంచటం ఎంతో కష్టమయిన పసితనాన్ని తనేం భరించలేదే? మరెందుకు పిలవాలి? ఏ రక్త సంబంధమూ లేని పరాయిదాన్ని అమ్మా అని ఎందుకు పిలవాలి?' ఒక్క ప్రశ్నకూ జవాబు దొరకలేదు రుక్మిణికి.

''నువ్వంటే నాకు చాలా ఇష్టం. నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటాను. మా ఇంట్లో వుంటావా?'' రవిని దగ్గరికి రమ్మని చేతులు జాస్తూ అన్నది రుక్మిణి.

రవికి ఆ మాటలు అర్థమయినట్లు లేదు. విసుగ్గా ముఖం పెట్టి "అమ్మా ఇంటికెళ్ళి పోదాం రా!" అన్నాడు. అనసూయ వెనక్కి తిరిగి చూడలేదు.

"రవీ! ఈ బిస్కెట్లు తిని వెళ్ళు" బిస్కెట్ ప్యాకెట్ రవి చేతికందించి ఎత్తుకున్నది రుక్మిణి. ఆ ప్యాకెట్టు చేతిలో పడగానే రవికి ఎక్కడలేని కబుర్లు గుర్తుకొచ్చాయి. స్కూలుకు తీసుకెళ్ళే ఆయా గురించి, ఎప్పుడూ బలపాలు అడుగుతూ వుండే నీతూ గురించి, స్కూలు టీచరు గురించి, ఆపకుండా ఏడ్చే చెల్లెలి గురించి, ఆటలు ఆడే అన్నయ్యల గురించి....ఇలా చెప్పిన కబురు చెప్పకుండా చెప్పాడు.

దానితో రుక్మిణి మనసు కొంచెం తేలిక పడింది.

అనసూయ గుండె బరువెక్కింది.

"ఇలాగే కొన్ని రోజులపాటు పంపిస్తాను. రవికి నువ్వు బాగా అలవాటవుతే అప్పుడు మా గురించి బెంగపెట్టుకోడు." గద్గదంగా అన్నది అనసూయ.

"సారీ! అనసూయా! మిమ్మల్ని చాలా బాధపెడ్తున్నాను."

"అలవాటయ్యేదాకే బాధ....ఆ తర్వాతే అసలు కథ మొదలవుతుంది."

'టాటా' చెబుతున్న రవిని కనుమరుగయ్యే దాకా చూసి లోపలికి వెళ్ళింది రుక్మిణి.

అడుపులో పెట్టలేని ఆనందంతో వున్న అర్ధాంగిని చూడగానే అర్థం చేసుకున్నాడు మాధవరావు.

"అనసూయ వచ్చి వెళ్ళిందా?"

"ఊ! శుభవార్త చెప్పి వెళ్ళింది." నవ్వుతూ అన్నది.

"రవిని ఇస్తానన్నారా? ప్రకాశరావుగారు ఒప్పుకున్నారా?" అనుమానంగా అడిగాడు.

"అందుకేగదా ఈ సంతోషమంతా! వరుసగా కొన్నిరోజులపాటు రవిని పంపిస్తానన్నది. మనం బాగా అలవాటు చేసుకుంటే...."

"మనం కాదు....రవికి మనం అలవాటు కావాలి!" మాటకడ్డువస్తూ అన్నాడు మాధవరావు.

"అదేలెండి! ఒకళ్ళకొకళ్ళం అలవాటవుతే..."

"రోజులు గడుస్తుంటే అదే అలవాటవుతుంది గాని....వాడు అమ్మా నాన్న అని పిలుస్తా

# చెప్పాలని వుంది మీకు

ప్రియమైన మీకు,
నా తోడుకి, నీడకి
తళుక్కుమనే తారలు మీ కళ్ళని,
ఆ కనుపాపల కదిలే భాగ్యం నాదని,
చిరుహాస్యం లాస్యం చేసే
పెదవులు మీవని,
ఆ నవ్వుల పువ్వులు నాకేనని,
తేనెకన్న తీయని పలుకు మీదని,
ఆ పలుకులు విని పులకించే కలికి నేనని,
తలదాచుకోనాలనిపించే హృదయం మీదని
ఆ ఎడదపై ఒదిగి ఇలను
మరిచేది నేనేనని,
మల్లెకన్న తెల్లని మనసు మీదని
ఆ మనసున మనసై నిల్చిన మగువ నేనని
మన దాంపత్య రథసారథి మీరేనని
మీ అడుగు జాడల నడిచే అర్ధాంగి నేనని,
చీకటిని వెలుగుగా, బాధను నవ్వుగా
చూపిన ప్రేమమూర్తి మీరని
మీ అనురాగ రాగిణిని నేనని,
నాకు తెలుసని,
చెప్పాలని వుంది మీకు!
ఇట్లు
ప్రేమతో
మీతో కదిలే నేను,
అదే, మీ నీడను
మీలో దాగిన
మీ శ్రీమతిని.

—మర్ల పద్మాశాస్త్రి

# సగటుమనిషి

ఆశల శిఖరాలను అందుకోవాలని
కోర్కెల నందనవనంలో విహరించాలని
కలల పంటలను పండించుకోవాలని
ఆశయాల పందిళ్ళలో పవళించాలని
నాకూ ఉంది; కానీ,
జెన్సింగునుకానినేను,
ఆశల శిఖరాలనెలా అందుకోను?
తోటమాలినైనా కాని నాకు
నందనవనమా?
ఇంటిపెరటిలో పాదులు
పెంచడానికైనా జాగా
లేని నాకు కలలపంటలా?
పందిరి వేయలేని నాకు
పందిళ్ళలో శయనమా?
పెరుగుతున్న జనాభాతో సంసారం
'అపోలో'లో వెడుతుంటే
నా చాలీచాలని జీతం నన్ను అగాధాల
లోనికి లాగుతుంటే
ఇక నాకు ఆశలూ, ఆశయాలూ
వీటికితోడు కోర్కెలూ, కలలూనా?
అదిగో అప్పుడే నన్నుచూసి
నవ్వుతున్నారుగా
నవ్వలేని నన్నుచూసి ఇంకా గట్టిగా
నవ్వండి!

—అల్లమరాజు అరుణశోభ

దంటావా?'' సందేహం వచ్చింది అతనికి.

''ఎందుకు పిలవడు? ఇప్పట్నించే ఆ అను మానం ఎందుకు మనకు?'' తేల్చేసింది రుక్మిణి. ఒక నెలరోజులపాటు విడవకుండా వచ్చాడు రవి. ఆదివారాలయితే ప్రొద్దున్నే వచ్చేవాడు. సోమవారం ప్రొద్దున టిఫిన్ పెట్టి పంపించేది. రవికి సందడిగా తోడుగా వుండాలని చుట్టుప్రక్కల పిల్లల్ని పిలిచి కూర్చోబెట్టేది. వాళ్ళతోపాటే తనూ పసిపిల్లగా మారిపోయేది. ఆ పిల్లల్లో పిల్లలా కలిసిపోయేది. రోజు రోజుకి ఆమె దిగులు తగ్గుముఖం పట్టింది.

ఆ ముప్ఫయి రోజులూ రవి చేత 'అమ్మా' అని పిలిపించుకోవాలని ప్రయత్నిస్తూనే వున్నది రుక్మిణి. ఫలితం కనుపించలేదు. ఒక రోజు మాధవరావుతో, ''రవితో ఇంత చనువుగా వున్న వాడు ఆంటీ అని తప్పితే అమ్మా అని పిలవటం లేదండీ. ఏం చేద్దామంటారు?'' అన్నది ఆమె దిగులుగా.

''ఇప్పుడే కదా కాస్త అలవాటయ్యాడు. రెండు మూడు నెలలుపోతే వాడే పిలుస్తాడు.'' ధైర్యం చెప్పాడు అతను. ఈ మధ్యనే రుక్మిణి బెంగని మర్చిపోయి కొంత ఉత్సాహంగా వుంటున్నది. ఆ ఉత్సాహంలో నీరు పొయ్యటం అతనికి ఇష్టంలేదు. స్తిమితపడింది రుక్మిణి మనసు.

ఒక శుభ ముహూర్తాన రవిచంద్రని దత్తత తీసుకుని, రుక్మిణీ, మాధవరావు తల్లీ తండ్రి అయ్యారు.

అమ్మా, నాన్నా అని పిలిపించుకోవాలని ఇద్దరూ తహతహలాడుతున్నారు. రవి మొదట్లో కొంచెం బెంగపెట్టుకున్నాడు. ఏదో విధాన దిగులును మరిపించి, ఏం కావాలో కొనిచ్చి, ఎంతో శ్రమతో అలవాటు చేసుకున్నారు.

రవిచంద్ర నవ్వితే నిండు పౌర్ణమిలా వుండేది రుక్మిణి మనసుకు. రవి ఏడుస్తుంటే కటిక చీకటిలో ప్రయాణంలా వుండేది రుక్మిణికి తన జీవితం. ప్రాణమంతా రవి మీద పెట్టుకొని బ్రతుకున్నది.

రుక్మిణి ప్రేమవాహినిలో రవి జీవిత నౌక సాఫీగా సాగిపోతున్నది.

*

ఆ రోజు ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాలు వచ్చాయి.

రుక్మిణి ఆనందానికి అవధులు కన్పించలేదు.

రవి ఫస్ట్‌క్లాస్‌లో పాసవటం తన విజయంగా భావించాడు మాధవరావు.

గుంటూరు పంపించి ఎం. బి. బి. ఎస్ లో చేర్పించాలనుకున్నాడు.

''ఎం.బి. చదవటం నా కిష్టం లేదు అంకుల్! బి.కాం. లో చేరతాను.'' పేపరు చదువుకుంటున్న మాధవరావు దగ్గరికి వెళ్ళి తన అభిప్రాయం చెప్పాడు రవి.

''రవీ! నువ్వు తెలివిగలవాడివి. నువ్వు డాక్టరివి కావాలని మా అందరి కోరిక. పెద్ద చదువు చదివి వృద్ధిలోకి రావాలని మేమెంతో ఆశపడుతున్నాము.''

''మీ ఆశా, ఆశయం బాగానే వున్నాయి కాని, డాక్టర్ వృత్తికి నేను సరిపోను. అది నా కిష్టం లేదు. అదీగాక పొరుగూరు వెళ్ళి చదువుకోవాలి. అది కూడా నా కిష్టం లేదు. ఇక్కడయితే వారానికోసారైనా వెళ్ళి అమ్మనీ, అందర్నీ చూస్తుంటాను. ఈ ఊరు విడిచి వెళ్ళటం నా కసలు ఇష్టంలేదు!'' తెగేసి చెప్పాడు రవి.

మనసులోనే నిట్టూర్చాడు మాధవరావు.

''నువ్విప్పుడు పెద్దవాడివయ్యావు. డిగ్రీ కోర్సులో చేరబోతున్నావు. ఏది మంచో ఏది చెడో తెలుసుకొనే విచక్షణాజ్ఞానం వస్తున్నది. చిన్నప్పటి నుంచీ మమ్మల్ని చూస్తున్నావు. నీ కోసమే, నువ్వు అమ్మా అని పిలిచే పిలుపుకోసమే బ్రతుకుతున్న ఆంటీని చూస్తున్నావు. ఒక్కసారి అమ్మా అని పిలవలేవా రవీ!'' ప్రాధేయపడుతున్నట్టు అన్నాడు మాధవరావు.

''ప్రయత్నిస్తాను అంకుల్! నాకూ బాధగానే వున్నది. చాలా సిగ్గుగా కూడా వుంది. మీరు పెంచిన ఈ శరీరం మీ మాటా నా మాటా వింటుంది కాని....నా మనసు ఎవరి మాటా వినటం లేదు. నన్ను క్షమించండి!'' తలవంచుకొని వెళ్ళిపోయాడు రవి.

రుక్మిణి కూడా చెప్పి చూసింది. ''బంగారం లాంటి భవిష్యత్తుని పాడుచేసుకోకు. డాక్టర్ కోర్సు ఇష్టంలేకపోతే ఇంజనీరింగ్ అయినా చదువు'' అని బ్రతిమిలాడింది.

''అంత పెద్ద చదువులు నా కిష్టం లేదు ఆంటీ! బి.కాం. ఫస్ట్‌క్లాస్‌లో పాసై ఎమ్.కాం. చదివి లెక్చరర్ కావాలని నా కోరిక. ఈ విషయంలో మీరింకేం అడ్డు చెప్పద్దు.''

రవి అంత కచ్చితంగా చెప్పినందుకు రుక్మిణి ముందు బాధపడింది. చిన్నప్పట్నించీ అతని స్వభావమంతేగదా అని తర్వాత సర్దుకుంది.

''ఆంటీ!'' అన్నప్పుడల్లా రుక్మిణి అమ్మ మనసు వుసూరుమనేది.

''ఏ జన్మలో పాపమో!'' అని కుమిలి పోయేది.

రోజులు గడుస్తున్నకొద్దీ ఈ దిగులు ఎక్కువయింది రుక్మిణికి.

రవి ఇంట్లో లేని సమయం చూసి రుక్మిణిని కోప్పడ్డాడు మాధవరావు.

''కోరికే అన్ని బాధలకు మూలం రుక్మిణీ! ఏ కోరికనూ నీ మనసులోకి రానీయకు.''

''నాకే కోరికా లేదండీ!.... ఆ ఒక్క....''

''చూడు రుక్మిణీ! రవి పెద్దవాడవుతున్నాడు. మన బాధ గమనిస్తున్నాడు. పిలవలేనందుకు వాడూ బాధపడ్తూనే వున్నాడు. ఏదో ఒక మంచి రోజున మనిద్దర్నీ అమ్మా నాన్నా అని మనస్ఫూర్తిగా పిలుస్తాడని నేను వాడి మీద కొండంత ఆశ పెట్టుకున్నాను. ఆశే కదా మనిషిని నడిపించేది...'' అని నెమ్మదిగా నచ్చజెప్పాడు.

అప్పటికి దుఃఖాన్ని దిగమింగింది రుక్మిణి.

*

అనసూయ దగ్గరకు ప్రతి ఆదివారం ప్రొద్దున్నే వెళ్ళిపోతాడు రవి. సోమవారం ఉదయం అట్నుంచి అటే కాలేజీకి వెళ్ళి సాయంత్రం తిరిగి వస్తాడు.

మంచి ఇల్లొకటి అమ్మకానికి వస్తే వెంటనే కొనేశాడు ప్రకాశరావు.

పెద్దకూతురికి పెళ్ళి చేశారు. అనసూయా, ప్రకాశరావు ముఖాల్లో ముసలితనం ముద్ర వేసింది. పెద్దకొడుక్కి గూడా సంబంధాలు చూస్తున్నారు.

రవి వెళ్ళినప్పుడల్లా ఇద్దరూ హెచ్చరిస్తూనే వున్నారు.

''రవీ! ఆంటీని ఏమని పిలుస్తున్నావు? ఆయన్ని అంకుల్ అనటం మానేశావా?'' ప్రకాశరావు కోపంగా అడిగాడు ఆ రోజు.

''ఇంకా లేదు నాన్నగారూ! మీరు చెప్పినప్పుడల్లా నేను పిలవాలనే అనుకుంటాను. తీరా వాళ్ళను చూడగానే మీరు గుర్తుకొస్తారు. ఆంటీ అంకుల్ అనే నా నోట్లోంచి వస్తున్నది. నన్నేం చెయ్యమంటారు?''

అమాయకంగా ముఖంపెట్టి అడుగుతున్న కొడుకు మీద కోపాన్ని చూపించలేక అవతలికి వెళ్ళిపోయాడు ప్రకాశరావు.

అన్నం పెడ్తూ అనసూయ అడిగింది: "అమ్మనీ నాన్ననీ కూడా రమ్మనకపోయావా? నువ్విటువస్తే వాళ్ళకిమటుకు ఏం తోస్తుంది?"

"ఏ అమ్మా, ఏ నాన్నా?" విసుగ్గా అడిగాడు రవి.

"అదేమిట్రా రవీ! ఎందుకంత విసుగు? కన్నతల్లి కంటె మిన్నగా చూసుకుంటున్నది రుక్మిణి. ఆ దేవతను అమ్మా అని పిలవలేవూ?" మందలింపుగా అన్నది.

"ఒక అమ్మకి ఇద్దరు కొడుకులుంటారు గాని...ఒక కొడుక్కి ఇద్దరమ్మలుంటారా?" ఎగతాళిగా నవ్వుతూ అన్నాడు రవి.

"ఒరేయ్! నీ తెలివితేటలు కట్టిపెట్టి....నేను చెప్పింది విను. అనుకుంటే ప్రతి ఆడదీ అమ్మే అవుతుందిరా! స్త్రీ హృదయం అమృతభాండం రవీ! అందులో సదా ప్రేమ వూరుతూనే వుంటుంది. అది తల్లిగా అందరికీ పంచుతూనే వుంటుంది. కంటేనే కడుపు కాదురా! కళ్ళల్లో పెట్టుకొని పెంచుతున్నదే....ఆ మాతృమూర్తి నీకు అమ్మకంటే ఎక్కువరా! నువ్వు ఇంటికి వెళ్ళగానే చెయ్యాల్సిన మొదటి పని....రుక్మిణిని అమ్మా అని పిలవటం. తెలిసిందా....?" గట్టిగా అన్నది అనసూయ.

"ఆఁ తెలిసిందిలే!" నిర్లక్ష్యంగా అన్నాడు రవి.

"నువ్వు ఆంటీ, అంకుల్ అని పిలవటం మానేస్తేనే ఇక్కడికిరా! లేకపోతే రావటం మానేయ్!" కోపంగా అన్నది.

"పోనీ! మమ్మీ డాడీ అని పిలవనా?" కొంచెం ఆలోచించి అన్నాడు.

"మమ్మీలు డాడీలు వద్దుగానీ....చక్కగా నోరారా అమ్మా అని నన్ను పిలుస్తున్నట్లు పిలవరా" ప్రాధేయ పూర్వకంగా అడిగింది అనసూయ.

"అయితే నిన్ను పిలవటం మానేసి ఆంటీనే అమ్మా అంటాలే! అలా పిలవలేకపోతే మీ ఇంటికి రానులే!" రోషంగా అన్నాడు రవి.

అనసూయ మాట్లాడలేదు.



నిమ్మవండుమ పిండాక ఆ మీది తొక్కలను భద్రం చేసి ఉంచి స్నానం చెయ్యడానికి ఉపయోగించే నీటిలో వేసి కాచి ఆ నీటితో స్నానం చేస్తే ఉత్సాహంగా ఉంటుంది.

"అసలు నేనంటే నీ కిష్టం లేదు. నాన్నగారి క్కూడా ఇష్టం లేదు. అందుకే ఆంటీ వాళ్ళింట్లో నన్ను పడేశారు. అంత ఇష్టం లేనప్పుడు నన్నెందుకు కన్నారు?" కంచంలో చేయి కడుక్కొని, కళ్ళల్లో నీరు తిరుగుతుంటే తలవంచు కున్నాడు రవి. ఇన్నాళ్ళూ రవిచంద్ర చిన్నవాడనే అనుకుంటున్నది అనసూయ. ఈ పెద్దమాటలు విని తెల్లబోయింది: "ఆ మాటలేమిట్రా రవీ! పెద్ద వాళ్ళతో మాట్లాడటం ఇలాగేనా? నువ్వంటే ఇష్టం లేక కాదు నాయనా! ఆంటీ బాధ చూడ లేక....అది పడే ఆవేదన చూసి...."

"ఓహో! ఎవరైనా నీ దగ్గరికొచ్చి బాధ పడితే వెంటనే పిల్లల్ని ఇచ్చేస్తావనన్న మాట. నన్ను వాళ్ళకి ఇచ్చావు. ఇంకా ఇద్దరు ముగ్గురు అడిగుంటే....అందరికి ఇచ్చేసి పెద్దన్నయ్యను ఒక్కడినీ నువ్వు పెంచేదానివన్న మాట!" వ్యంగ్యంగా అన్నాడు.

"రవీ!" కోపంతో గట్టిగా అరిచాడు ప్రకాశరావు. "అమ్మను ఎంతమాట పడితే అంత మాట అంటావా?" అంటూ చెయ్యెత్తాడు.

"ఆగండి!". అతి ప్రయత్నం మీద భర్త చేతిని క్రిందికి దించింది అనసూయ.

"రవీ! ఆఖరుసారిగా చెబుతున్నాను విను. వాళ్ళని అమ్మా నాన్నా అని పిలుస్తేనే ఇంటికిరా! లేకపోతే రావటం మానెయ్యాలి." హెచ్చ రిస్తున్నట్టు అన్నాడు ప్రకాశరావు.

రవి "అయితే....మొదటిసారిగా నేను చెప్పేది వినండి. వాళ్ళని అలా పిల్చి మిమ్మల్ని ఆంటీ అంకుల్ అని పిలుస్తాను. ఒప్పుకుంటారా?" అని అడిగాడు.

నోట మాట రానట్లు నిశ్చేష్టులయ్యారు వాళ్ళు.

"ఆలోచించుకొని ఏ సంగతీ రేపు నేను కాలేజీకి వెళ్ళేలోపల చెప్పండి." వాళ్ళిద్దర్నీ వంటింట్లో వదిలేసి క్రికెట్ ఆడుకోవడానికి వెళ్ళి పోయాడు రవిచంద్ర. అప్రయత్నంగానే ముఖ ముఖాలు చూసుకున్నారు అనసూయ, ప్రకాశరావు. కళ్ళజోడు తుడుచుకుంటూ ప్రకాశరావు వాకిట్లోకి, కళ్ళు తుడుచుకుంటూ అనసూయ పెరట్లోకి వెళ్ళారు.

పడుకోబోయే ముందు అనసూయని అడిగాడు ప్రకాశరావు: "రేపు రవికి ఏం చెబుతాము?"

"ఏమోనండీ! ఏం చెప్పాలో తోచడం లేదు. అయినా వీడింత మొండిగా తయారయ్యాడు ఏమిటి?" దిగులుగా అన్నది.

"ఇంకా చిన్నతనం కదా అనసూయా! కొన్నాళ్ళు పోతే వాడే సర్దుకుంటాడు. మనమే ఆంటీ అంకుల్‌గా మారిపోదామా?" భార్య ముఖంలోకి పరీక్షగా చూస్తూ అన్నాడు. ఉలిక్కి పడింది అనసూయ: "ఇన్నాళ్ళూ అమ్మనై ఇప్పుడు ఆంటీ నేమిటండీ!" బాధగా అన్నది.

"పిలిపించుకోడానికే నువ్వింత ఆలోచిస్తుంటే పిలవటానికి వాడెంత బాధ పడాలి? ప్రొద్దున వాడిమీద చెయ్యెత్తిన దగ్గిర్నుంచి నాకు సిగ్గుగానే వున్నదనుకో! నా మీద నాకే అసహ్యమేస్తున్నది. ఇంకా వాడు నా మీద గౌరవముంచి అలా నిలబడ్డాడు గాని....'చెయ్యి దించండి నాన్నగారూ' అని ఉంటే మన మర్యాద, పెద్దరికం ఏం నిలిచేవి? అందుకే ఈ కాలపు తండ్రులు చాలామంది పిల్లలతో స్నేహంగా వుండి వాళ్ళతో మంచిగా మాట్లాడి వాళ్ళ మర్యాద వాళ్ళు దక్కించు కుంటున్నారు."

"నన్ను పిలిస్తే రుక్మిణిని పిలవకూడదా? ఆయన్ని పిలిస్తే మిమ్మల్ని పిలవకూడదా? దత్తత ఇచ్చేటప్పుడు ఇవన్నీ ఆలోచించలేదు మనం. రుక్మిణి దిగులుతీరితే చాలనుకున్నాము. ఇప్పుడే సమస్యలన్నీ వచ్చి పడ్డాయి. ఏం చేద్దా మంటారు?"

"గతం నాస్తి! జరిగిపోయింది. ఇప్పుడు మనమే ఆంటీ అంకుల్‌గా మారటం మంచిదను కుంటున్నాను. కాలేజీకి వెళ్ళేటప్పుడు ఆ సంగతే చెప్పు."

"అయినా వీడికింత పట్టుదల ఎందుకండీ?"

"మూర్ఖులకు ఎవరు చెప్పగలరు అనసూయా?" నిట్టూర్చాడు అతను. "ఆలోచనలు చాలు గాని ఇంక నిద్రపో!"

ఒకరికి తెలియకుండా ఒకరు నిద్రమాత్రలు వేసుకుని పడుకున్నారు. [సశేషం]

5


పెద్దకథ:

# అమ్మ

ఉండవల్లి జయశ్రీ

"పెద్దన్నయ్య స్కూటర్ మీద తీసుకెళ్తా నన్నాడు. నే వెళ్ళొస్తాను." మర్నాడు ఉదయం వంటింట్లో వున్న అనసూయ దగ్గరకు వచ్చి చెప్పాడు.

"ఈ రోజు నాన్నగారితో కార్లో వెళ్ళటం లేదా?"



"ఊహుఁ అన్నయ్యతో కాలేజీకి వెళ్తున్నాను. ఆంటీ నిన్నొకసారి రమ్మంది."

పుస్తకాలూపుకుంటూ వెళ్ళబోయాడు రవి.

"నీకిష్టమని పెసరట్లు వేస్తే తినకుండా వెళ్తావేం? తినెళ్ళు. అన్నయ్యని కూడా పిలు."

వంటావిడ చేతులోంచి టిఫెన్ ప్లేట్లు అందు కుంటూ అన్నది అనసూయ.

"అమ్మా! రాత్రంతా నువ్వు నిద్రపోలేదా?" పీక్కుపోయిన తల్లి ముఖం చూసి అడిగాడు రవి. అనసూయ మాట్లాడలేదు.

"అమ్మా! నెలల పిల్లాడిగా వుండగానే ఇచ్చేయకపోయావా? స్కూల్లో చేరాక ఎందు కిచ్చావు?"

'అప్పుడు నిన్ను విడిచిపెట్టి వుండలేక పోయాను. ఆ తర్వాత రుక్మిణి బాధ చూడలేక పోయాను.' మనసులోనే అనుకున్నది.

"గడపలు దాటేటప్పుడు చెప్పినా పిలిచే వాడినేమోగాని....ఇప్పుడు పిలవలేకపోతున్నాను."

"నిజమే నాయనా! చిన్న పిల్లాడివైనా బాగా చెప్పావు. గడపలు దాటేటప్పుడు బిడ్డలుకానీ గడ్డాలొచ్చాక బిడ్డలా?" నిట్టూర్చింది అనసూయ.

"అమ్మా! ఇన్నాళ్ళూ నేను వాళ్ళని అలా పిలవాలని గట్టిగా అనుకోలేదు. ఈ రోజు నుంచి తప్పకుండా పిలవటానికి ప్రయత్నిస్తాను. వచ్చే వారం రావటం మాత్రం మానెయ్యను. పెద్దన్నయ్య కేదో చూస్తున్నారుటగా! నన్ను కూడా తీసుకెళ్తా నన్నాడు. వస్తాను. కాలేజీకి టైమయింది. నాన్నగారితో చెప్పు. సుధా! టా....టా...." చెల్లెలికి చెయ్యూపుతూ వెళ్ళిపోయాడు రవి.



438

'ఇల్లంతా బోసిపోయింది!' ప్రతి సోమవారం అనసూయ ఆ మాట అనుకోకుండా వుండలేదు.

*

సుధని వెంటబెట్టుకొని అనసూయ చాలా రోజుల తర్వాత రుక్మిణీ దగ్గరకు వచ్చింది.

"ఎన్నాళ్ళయింది అనసూయా నిన్ను చూసి.... బాగున్నావా? పిల్లలందరూ బాగున్నారా? పెద్దమ్మాయి దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయా? ఏం సుధా! బాగా చదువుతున్నావా?" గుక్క తిప్పుకోకుండా అడిగింది రుక్మిణీ.

"అందరం బాగానే వున్నాము కాని....నువ్వేమిటి ఇలా అయిపోయావు? ఒంట్లో కులాసాగా వుండటం లేదా?" అభిమానంగా అడిగింది అనసూయ.

"నాకేం నేను బాగానే వున్నాను. ఆయనకే నాల్గు రోజుల్నించి జ్వరం వస్తున్నది. ఈ పూటే కొంచెం తగ్గింది. డాక్టరు దగ్గరికి వెళ్ళొస్తానని ఇప్పుడే బయల్దేరారు. మీకెదురు పడలేదూ?" కాఫీ కలుపుతూ అన్నది రుక్మిణీ.

"కన్పించారు. ఏమిటండీ ఇలా చిక్కిపోయారంటే నవ్వి వూరుకున్నారు. ఒంట్లో బాగుండ్లేదేమో అనుకున్నాను. అవునుగానీ రుక్మిణీ! ఇద్దరికిద్దరూ ఇలా అయ్యారేమిటీ? మనసులో ఏ దిగులూ పెట్టుకోలేదు కదా!" తను తెచ్చిన పూలను రుక్మిణి తలలో పెడుతూ అన్నది అనసూయ.

"ఇప్పుడో కొత్త సమస్య వచ్చి పడింది. మీ వారికి కూడా చెప్పి చూడు."

"ఏమిటది?" కొంచెం ముందుకు జరిగి ఆత్రంగా అడిగింది అనసూయ.

"మా వారికి మళ్ళీ ట్రాన్సఫర్ వచ్చింది. ఇప్పటికి రెండు మూడు సార్లు ఎలాగో తంటాలు పడి ఆపుకున్నాము కదా! ఈ సారి ఆగేలా లేదు. ఇంకా రవికి రెండేళ్ళ చదువుంది. ఏం చెయ్యాలో తోచటం లేదు."

"నేను పెద్దమ్మాయి దగ్గర్నుంచి రాగానే నీ దగ్గరికి వద్దామనుకున్నాను రుక్మిణీ! కాని.... వెంటనే మా తమ్ముడి కూతురు పెళ్లైతే అక్కడికి వెళ్ళాల్సి వచ్చింది. రాముా నీకు శుభలేఖ పంపాడుట. అందలేదా?"

"అందలేదు. మన కళ్ళ ముందేగా రామూకి పెళ్ళయింది. అప్పుడే అల్లుడొచ్చాడన్నమాట. రేపీ పాటికి తాతయ్య కూడా అయిపోతాడు. చాలా మంచి వార్త చెప్పావు. ఏదో ఒక క్షణం అందరి జీవితాల్లోనూ మార్పు తెస్తుంది. నన్ను కట్టుకున్న నేరానికి ఆయన జీవితం కూడా ఎడారి అయిపోయిందనుకో!" బాధగా నిట్టూర్చింది రుక్మిణీ.

"మీ తమ్ముడు ఎక్కడుంటున్నాడో తెలిసిందా?" మాట మార్చింది అనసూయ.

"ఆ! డెహరాడూన్‌లో వుంటున్నాడు. ఆ మిలటరీని విడిచి రానని రాశాడు."

"మీ అమ్మగారు...." అనుమానంగా ఆపేసింది అనసూయ.

"కూతురికి పిల్లలు పుట్టలేదని ఒక దిగులూ కొడుకు దూరంగా మిలటరీకి వెళ్ళిపోయాడని మరో దిగులుతో ఆవిడ కన్నుమూసింది."

"అరెరె! ఎంత పని జరిగింది!" బాధపడింది అనసూయ.

"ఇప్పుడు ఆయనకి నేనూ నాకు ఆయనా తప్పితే ఎవరూ లేరనుకో!" నిస్పృహగా అన్నది.

"మీకు రవిచంద్ర లేడా?" అందామనుకున్నది అనసూయ. పైకి మటుకు అనలేదు.

"ఎవరికైనా అంతే రుక్మిణీ! భర్తకి భార్య, భార్యకి భర్తే అండగా వుండేది. పిల్లలకు రెక్కలొచ్చాక గూడు వదలి ఎగిరిపోవటం సహజం కదా! చివరికి మిగిలేది మనమే! మనమలాగే వచ్చాము. మన పిల్లలలాగే వెళ్ళారు. వెళ్తారు."

"నువ్వు చెప్పింది నిజమే అనసూయా! ఏదో బాధ కొద్దీ అనుకోవటమే గాని!"

"రవి ఎలా చదువుతున్నాడు! మార్కులు ఎలా వస్తున్నాయి?" మళ్ళీ మాట మార్చింది అనసూయ.

"చాలా బాగా చదువుకుంటున్నాడు. మంచి మార్కులే వస్తున్నాయి. నిన్నటి నుంచే టైపు, షార్ట్‌హాండ్‌కి వెళ్తున్నాడు." ఉత్సాహంగా చెప్పింది రుక్మిణీ.

"రవికి పెళ్ళీ పేరంటం జరిగేదాకా బ్రతుకుతానో లేదో అనిపిస్తున్నది అనసూయా!"

"ఛ! అవేం మాటలు? మీరు బ్రతుకుతున్నది రవి కోసం. రవికి ఉద్యోగం రావాలి, పెళ్ళి జరగాలి. పిల్లలు పుట్టాలి. వాళ్ళచేత బామ్మా తాతయ్యా అని పిలిపించుకోవాలి. ముందు ముందు ఇంకా ఎన్ని వున్నాయి రుక్మిణీ! అలాంటి పిచ్చి ఊహలు రానీయకు!" అంటూ మందలించింది అనసూయ.

"నేను ఇప్పుడు బ్రతుకుతున్నది రవి కోసం కాదు అనసూయా!" నీరసంగా అన్నది రుక్మిణీ.

"నువ్వు రవి కోసమూ వుండాలి. దేవుడిలాంటి మీ వారి కోసమూ బ్రతకాలి. ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకు." ఇంటికి వెళ్ళటానికి లేచింది అనసూయ.

"నేను నిజమే చెబుతున్నాను. రవిచంద్ర పిలిచే అమ్మా అనే పిలుపుకోసమే బ్రతికి వున్నాను అనసూయా! ఏదో ఒకరోజు వాడు మనస్ఫూర్తిగా, నిండుగా నోరారా 'అమ్మా' అని పిలుస్తాడనీ, ఆయన్ని 'నాన్నా' అని పిలిచి అభిమానంగా చూస్తాడనీ ఇంతకాలం కొండంత ఆశ పెట్టుకొని బ్రతికాము. ఇప్పుడు నా పరిస్థితి గాలిలో పెట్టిన దీపంలా వున్నది. ఏ క్షణాన ఆరిపోతుందో తెలియదు." అన్నది.

రుక్మిణీ మాటలు వింటుంటే కళ్ళల్లో నీరు క్రమ్మింది అనసూయకు.

"నీ కోరికను భగవంతుడు త్వరలో తీరుస్తాడని ఆశిస్తున్నాను రుక్మిణీ! వస్తాను." బొట్టు పెట్టించుకొని రెండడుగులు వేసింది అనసూయ.

"అన్నట్లు మర్చిపోయాను. మీ ఆయన్ని రేపొకసారి మా ఇంటికి రమ్మను. ఆ ఉద్యోగం మానేసి మా కంపెనీలో షేర్స్ తీసుకోమన్నారు మా వారు. ఏమంటారో అడుగు. ఏ సంగతీ రేపొద్దున మా వారు వుండగా వచ్చి చెప్పమను." గబగబా చెప్పి రిక్షా ఎక్కేసింది అనసూయ.

ముందు ఉద్యోగం మానెయ్యటానికి మాధవరావు ఏ మాత్రమూ ఒప్పుకోలేదు.

రవిచంద్ర పట్టుదలతో, రుక్మిణీ బలవంతంతో ఉద్యోగానికి రాజీనామా ఇవ్వక తప్పలేదు. ఆరోగ్యం బాగుండకపోయినా, ఆఫీసుకు వెళ్ళొచ్చే భర్తని చూడగానే ప్రాణం వుసూరుమనేది. ఇందులో అయితే....కూర్చోవాలన్నంతసేపు కూర్చొని, కూర్చోలేకపోతే వచ్చేయచ్చు. అన్నీ ప్రకాశరావుగారే చూసుకుంటారు. కాబట్టి అడిగే వాళ్ళుండరు. ఈ ఆలోచనతో ఉద్యోగం మానెయ్యమన్నది రుక్మిణీ.

మనశ్శాంతికోసం వాళ్ళు తనని పెంచుకుంటే ఆ మనసుని మరింత ముక్కలు చేస్తున్నది తన ప్రవర్తన. స్థలం మారితే మనసు కుదుటపడు

తుందేమోనని మరీ మరీ చెప్పాడు రవి— కంపెనీలో షేర్స్ తీసుకోమని.

జీవితమంతా ఆలోచనలతోనే గడిచిపోయే సరికి మనసూ శరీరమూ అలిసిపోయాయి మాధవరావుకి. అందుకే మరింకేం మాట్లాడకుండా మంచిరోజు చూసి ప్రకాశరావు కంపెనీలో భాగస్థుడిగా చేరిపోయాడు.

*

కాలగమనంలో రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి.

బి. కాం. ఆఖరి సంవత్సరం పరీక్షలు వ్రాసి ఫలితం కోసం ఎదురు చూస్తున్నాడు రవి.

టైపు, షార్ట్‌హాండ్‌లలో కూడా సర్టిఫికేట్లు తీసుకున్నాడు. తెలిసిన వాళ్ళెవరో టైపు ఇన్‌స్టిట్యూట్ పెడితే అందులో పార్ట్‌టైము జాబ్ చేస్తున్నాడు

అనసూయ పెద్దకోడలు చాలా మంచిది. ఆ అమ్మాయి తరచూ రుక్మిణి దగ్గరకు వచ్చి ఇంట్లో సందడిగా తిరుగుతూ వుంటుంది.

రవిచంద్ర ఒంటరిగా కన్పించినప్పుడల్లా చెబుతూనే వుంటుంది: "నీ పిలుపు కోసం ఆ ముసలి వాళ్ళను ఎన్నేళ్ళు ఏడిపిస్తావు రవిచంద్రా? చదువుకున్న వాడివని, తెలివిగల వాడివని అనుకున్నాను ఇన్నాళ్లూ. నువ్వు మరీ మూర్ఖుడిలా ప్రవరిస్తున్నావు. నీ సంస్కారం ఏమయింది? పార్వతీ పరమేశ్వరులలా వున్న ఆ వృద్ధ దంపతులను చూస్తుంటే నీకు పూజ్యభావం కల్గటంలేదా? అమ్మా అని నోరారా పిలవాలనిపించటంలేదా? ఎందుకొచ్చిన చదువు? ఎమ్. కాం. చదివి ఎవర్ని ఉద్ధరిస్తావు? నీ శిష్యరికం చేసే భావిపౌరు లందరూ పరమ మూర్ఖులుగా తయారవుతారు. ఎప్పుడో నువ్వు పిలవాలి అనుకున్న రోజు నీకు తెలియకుండానే జారిపోతుంది. అప్పుడు నువ్వెంత ఏడ్చినా, మొత్తుకున్నా, పశ్చాత్తాపపడినా జరిగిపోయిన కాలంగాని, ఆగిపోయిన ప్రాణంగాని తిరిగిరావు. నువ్వు త్వరగా మేల్కొవటం మంచిది."

ఊహ తెలిసిన దగ్గర్నుంచి, అనసూయ హెచ్చరించినప్పుడల్లా రవికి రుక్మిణిని అమ్మా అని పిలవాలనే వుంటుంది. తీరా పిలిచే వేళకి సిగ్గుగా అన్పిస్తుంది. కొత్త మనిషిని చూస్తున్నట్లు నిలబడిపోతాడు. లోపల పదిసార్లు అమ్మా అమ్మా అని మననం చేసుకున్నా ఒక్క అక్షరం కూడా ఒక్కసారైనా నోట్లోంచి బయటికి రాలేదు. రావటంలేదు.

*

ఆ రోజు ఆఫీసు కెళ్ళిన అరగంటకి "మీకు ఫోనొచ్చింది సార్!" అంటూ వచ్చి చెప్పాడు గుమస్తా గవరయ్య.

ఎవరో అనుకుంటూ యధాలాపంగా 'హలో' అన్నాడు మాధవరావు.

"హలో....నేను నాన్నా! రవిచంద్రని మాట్లాడుతున్నాను. మా రిజల్ట్సు వచ్చాయి. నేను ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను నాన్నా! సాయంత్రం త్వరగా వస్తారా? గుడికెళ్ళి అట్నుంచి పిక్చర్‌కి వెళ్దాము. నాన్నగారితో కూడా చెప్పండి." ఫోన్ పెట్టేశాడు రవిచంద్ర.

తన్మయత్వంలో అరమోడ్పు కన్నులతో విన్నాడు మాధవరావు.

"ఇన్నేళ్ళకి వాడు నన్ను 'నాన్నా!' అని పిలిచాడు. నాతో ముందుగా తన రిజల్ట్సు గురించి చెప్పాడు. పిచ్చితండ్రి! ఇన్నాళ్ళూ సిగ్గుపడి పిలవలేదేమో? నిజంగా ఈరోజు నేను తండ్రి నయ్యాను." మాధవరావు శరీరం పులకించింది.

"మా అబ్బాయి ఫోన్ చేశాడోయ్! బి. కాం. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు!" ఉత్సాహంగా అందరికీ చెప్పాడు.

"అవునుగానీ గవరయ్యా! ఇందాక ఫోనులో మావాడు ఎవరు కావాలని అడిగాడు? నన్నా, ప్రకాశరావుగార్నా?" అనుమానం తీర్చుకోవటం మంచిదనుకున్నాడు మాధవరావు.

"మిమ్మల్నే సార్! అసలు ప్రకాశరావుగారి మాటే ఎత్తలేదండీ!" అన్నాడు గవరయ్య.

"ఈరోజు పొందిన తృప్తి, కల్గిన మనశ్శాంతి జీవితంలో నేనింతవరకూ అనుభవించలేదు" అనుకున్నాడు మాధవరావు మరోసారిసంతృప్తిగా.

ఈ మాట చెబితే రుక్మిణి ఎంత సంతోషిస్తుందో? కలలు ఫలించాయని ఎంతో ఆనందిస్తుంది. అప్పటికప్పుడు బయల్దేరి ఇంటికి వెళ్దామన్పించింది అతనికి. కారు దగ్గరకు ఆత్రంగా వెళ్ళబోతుంటే మెరుపులా ఒక ఆలోచన మెరిసింది. 'రుక్మిణిని అమ్మా అని అన్నాడో లేదో? తనని అమ్మా అనకుండా నన్ను నాన్నా అంటే ఆమె భరించగలదా? పిలిస్తే ఇద్దర్నీ పిలవాలి లేదా మానెయ్యాలి. అయినా నేను తండ్రినైనప్పుడు ఆమె తల్లి కాదా?' నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ అనుకున్నాడు మాధవరావు.

'నన్నే పిలిచినవాడు, అంతగా తనిస్తున్న రుక్మిణిని అమ్మా అనకుండా వుంటాడా?' అని మరో ఆలోచన వచ్చింది. ఏదైనా ఇంటికెళ్ళి తేల్చుకోవటం మంచిదనుకున్నాడు.

"రుక్మిణీ! రవేడి?" ఇంట్లో అడుగుపెడుతూనే అడిగాడు మాధవరావు.

"ఇప్పటిదాకా ఇక్కడే వున్నాడు. ఇప్పుడే వాళ్ళ ఫ్రెండ్ వస్తే బయటికి వెళ్ళాడు. ఏమిటీ విశేషం? అలా వెళ్ళారు. ఇలా వచ్చారు." భర్త ముఖంలో వెల్లివిరుస్తున్న సంతోషాన్ని చూస్తూ అడిగింది రుక్మిణి.

"మన అబ్బాయ్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయితే సంతోషం కాదుటోయ్! అంతకంటె విశేషం ఇంకేం వుండాలి? ఈ శుభసమయంలో నీ చేత్తో ఒక కప్పు కాఫీ ఇవ్వు." నవ్వుతూ అన్నాడు మాధవరావు.

"సాయంత్రం గుడికెళ్దామన్నాడు రవి. త్వరగా వస్తారా?" కాఫీ ఇస్తూ అన్నది రుక్మిణి.

"రాకుండా వుండగలనా? నిన్ని రోజైనా అమ్మా అని పిలవలేదా రుక్మిణీ!" నెమ్మదిగా అడిగాడు.

రుక్మిణి ముఖంలో రంగులు మారాయి.

"నా ఎదురుగా పిలువలేదు గానీ, ఎందుకో ఈరోజు వాడు అమ్మా అని పిలిచినట్లే వున్నది. ఎంతో చనువుగా దగ్గర కూర్చొని ఎన్నో కబుర్లు చెప్పాడు. మళ్ళీ నాకు చిన్నారి రవిచంద్రే గుర్తొచ్చాడు." కాఫీ త్రాగుతూ మౌనంగా విన్నాడు మాధవరావు.

"కూర తరుగుతుంటే అమ్మా, అమ్మా అని పిలిచినట్లే అన్పించింది. నేను ఆత్రంగా ముందు గదిలోకి పరుగెత్తుకొచ్చాను. అక్కడ రవి పేపరు చూసుకుంటూ కూర్చున్నాడు. 'రవీ! పిలిచావా' అని అడిగితే ఒకసారి తలెత్తి చూసి 'ఊఁ పిలిచాను. మా రిజల్ట్సు వచ్చాయి. నేను ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను' అంటూ వచ్చి నా కాళ్ళకు దండం పెట్టాడండీ! ఈ రోజు నాకెంత ఆనందంగా వుందో తెలుసా? కాని...నా ఎదుటగా పిలవలేదు. 'అమ్మా' అనలేదు. అదొక్కటే లోటని పిస్తున్నది....." తను కూడా కాఫీ తెచ్చుకొని

వ్రాగుతూ అన్నది రుక్మిణి.

"మనిషి ఎదురుగా వుంటే పిలవటమెందు కోయ్? కనుమరుగవుతేనే కదా సంబోధించే అవసరం వస్తుంది!" సర్ది చెప్పాడు మాధవరావు.

"నేను వచ్చి వెళ్ళానని రవికి చెప్పు. సాయంత్రం రెడీగా వుండండి." మళ్ళీ ఆఫీసుకి బయల్దేరాడు మాధవరావు.

"మరి కోరిక ఎలా తీరుతుందండీ?" అతని వెనకనే అడుగువేస్తూ అన్నది రుక్మిణి.

"ఆ నుంచిరోజు కూడా త్వరలో వస్తుంది రుక్మిణీ! ఇప్పుడిప్పుడే పిలవాలనుకుంటున్నాడు. ఈరోజే పిలిచాడు. కొత్తల్లో కొంచెం సిగ్గుగా వుంటుంది కదా!" అని నచ్చ చెప్పాడు.

"నా దగ్గర సిగ్గెందుకండీ? నేనేం పరాయి దాన్నా! చిన్నప్పట్నుంచి చూస్తున్నాడు. ఇంకా కొత్తేనా?" గట్టిగా అన్నది రుక్మిణి.

"అదేదో వాడొచ్చాక కనుక్కో!" అని హడావుడిగా కారెక్కి వెళ్ళిపోయాడు మాధవరావు.

ఆ సాయంత్రం ముగ్గురూ కలిసి అనసూయా వాళ్ళింటికి వెళ్ళి, అక్కడ్నించి అందరూ కలసి గుడికెళ్ళి, సినిమా చూసొచ్చారు.

*

ఎవరెంత చెప్పినా రవిచంద్ర ఎమ్. కామ్‌లో చేరటానికి ఒప్పుకోలేదు. సంస్కారం లేని చదువు ఎందుకనిపించింది? ఆ మాటే వదినగారితో అన్నాడు.

"ఆరోజు నేనన్న మాటలు నిన్ను చాలా బాధపెట్టినట్లున్నాయి రవీ! సారీ! వాళ్ళని అమ్మా నాన్నా అని పిలవలేనందుకు నీ మనసుకి నీకే సిగ్గుగా వుంది కదా! గట్టిగా ప్రయత్నిస్తే నువ్వే అనగలవు. ఈ విషయానికి నువ్వు చదువు మానటం అనవసరం. నువ్వు గుంటూరు వెళ్ళి ఎమ్. కామ్‌లో చేరు. నువ్వు పెద్ద చదువు చదివి మంచి ఉద్యోగంలో చేరితే వాళ్ళకి తృప్తిగా వుంటుంది. ఇప్పుడు నువ్వు చదువు మానితే నావల్లే నీ భవిష్యత్తు పాడయిందని నేను జీవితాంతం బాధపడాల్సి వుంటుంది. ప్లీజ్! నువ్వెళ్ళి ఎమ్. కామ్‌లో చేరు. నిన్నొక తమ్ముడిగా భావించి చెబుతున్నాను!" ప్రాధేయపడుతూ అన్నది ఆమె.

అందరి బలవంతం మీద గుంటూరు వెళ్ళి ఎమ్. కామ్‌లో చేరాడు రవిచంద్ర.

వారానికో ఉత్తరం తప్పని సరిగా రుక్మిణికి వ్రాయటం అలవాటు చేసుకున్నాడు.

ఉత్తరంలో మాత్రం ప్రియమయిన అమ్మకు అంటూ మొదలు పెట్టాడు. అది చూసే ఎంతో తృప్తి పడ్తుంది రుక్మిణి. తోచనప్పుడల్లా రవిచంద్ర రాసిన ఉత్తరాలు తీసి మళ్ళీ మళ్ళీ చదువుకుంటుంది.

'గుంటూరు నీళ్ళు వేడంటారు. అవి రవి ఒంటికి పడ్డాయా లేదో? ఆ హోటల్ భోజనం సయిస్తున్నదో లేదో? మంచి స్నేహితులు తోడు దొరికారో లేదో!' ఇలా ఎన్నో విధాల ఆలోచిస్తూనే వుంటుంది.

బజార్లో ఏ అందమైన అమ్మాయి కన్పించినా రుక్మిణికో ఊహ వస్తుంటుంది. 'ఇలాంటి పిల్ల అయితేనే రవిచంద్రకి మంచి జోడిగా వుంటుంది' అనుకుంటుంది.

"నా కొడుకూ కోడల్నీ చూడగానే మంచి ఈడూ, జోడూ అనుకోవాలి తెలుసా?" అని భర్తతో వాదనకి దిగుతుంది.

"నీ కొడుకేమన్నా మన్మథుడా? కోడలు రతిదేవి రావాలంటావు?" నవ్వుతాడు మాధవరావు.

"సర్లెండి! వాడి అందాలు నేను చెప్పటమెందుకు దిష్టితగిలేలా? మీ సుపుత్రుడి గురించి మీకు తెలియదా?" అని నవ్వుతుంది రుక్మిణి.

రవిచంద్ర మాటలతో వాళ్ళకు కడుపు నిండిపోతుంది.

రవిచంద్ర ఊహలలో వాళ్ళకు కమ్మగా నిద్ర పడుతుంది.

*

కాలపురుషుడు మరో అడుగు ముందుకేశాడు.

'ఈ ఒక్క సంవత్సరం కష్టపడితే రవి మన దగ్గరికి వచ్చేస్తాడు' అని ధైర్యం చెప్పుకున్నారు రుక్మిణీ, మాధవరావు. సరిగ్గా ప్రతి సోమవారం రవి దగ్గర్నుంచి ఉత్తరం వస్తుంది రుక్మిణికి.

ఆ రోజంతా ఉత్సాహంగా వుంటుంది. అది తీసుకుని అనసూయ దగ్గరికి వెళ్ళి ఆమెతో కలిసి మళ్ళీ చదువుతుంది.

ఇన్నేళ్ళనుంచి పెంచి పెద్దచేసి ఇంత చదువు చెప్పిస్తున్నందుకు రవి అవిధేయతతో వుండకుండా ఆప్యాయంగా ఉత్తరాలు వ్రాస్తున్నందుకు అనసూయా, ప్రకాశరావు ఎంతో సంతోషించారు. రవి ఎమ్. కామ్ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాశాడు. ఫ్రెండ్స్‌తో కలిసి చుట్టుప్రక్కల వున్న ఊళ్ళు చూసి ఓ వారం రోజుల్లో వస్తానని రాశాడు రవి.

*

ఆ రోజు లేచిన దగ్గర్నుంచి రుక్మిణికి ఒంట్లో బాగుండ్లేదు. మాధవరావు డాక్టర్ని తీసుకొచ్చి

## వినతి

'వనిత'కు ప్రచురణ కోసమని కథలు, వ్యాసాలూ గేయాలూ మొదలైనవి పంపేవారు కొన్ని విషయాలను గుర్తుంచుకోవలసిందిగా కోరుతున్నాము. కథలు, వ్యాసాలూ సాధ్యమైనంత క్లుప్తంగా వుండాలి. పేజీకి ఒక్కవైపునే సిరాతో శుభ్రంగా, తెలిసేలా—రాయాలి. ప్రతి రచనపైనా, వారి పేరు, పూర్తి చిరునామా వుండాలి. అది ఏ రచన అయినాసరే, అది తమ సొంతం అని, దేనికీ అనుసరణ, మక్కీ కాదని, దీంతోపాటే ఇంకొక పత్రికకు కూడా పంపలేదనీ—హామీ పత్రం రాసి ఇవ్వాలి. ప్రతి రచనతోపాటు, తమ చిరునామా రాసివున్న కవరును స్టాంపులతో సహా జతచేసి, పంపితేగాని, సమాధానం ఇవ్వడానికిగాని, రచన తిప్పిపంపడానికిగాని వీలుండదు. రచనల పరిశీలనకు కనీసం మూడు మాసాలైనా వ్యవధి కావలసివుంటుంది. ఈలోగా, 'రచన ఏమైంది?' అని ఉత్తరాలు రాయడంవల్ల ప్రయోజనం వుండదు. (రచన ప్రచురింపబడే పక్షంలో, ముందుగానే రచయిత్రులకు తెలియజేయబడుతుంది) ఈ చిన్న విషయాలను గుర్తుంచుకుని, మాతో సహకరించవలసిందిగా రచయిత్రులను కోరుతున్నాము.

—వ. సం

చూపించాడు. ఆయన రాసిచ్చిన మందుల్ని తెమ్మని పనివాణ్ణి పంపించి రుక్మిణి దగ్గరకు వచ్చి కూర్చున్నాడు అతను.

"ఏమిటి రుక్మిణీ! ఉన్నట్లుండి అలా నీరస పడ్డావేం? ఎలా వుందసలు?"

ఏమీ లేదన్నట్లుగా తలూపింది రుక్మిణి.

"అనసూయకి ఫోన్ చేస్తాను. రవెప్పుడు వస్తాడు?" లేస్తూ అన్నాడు.

"రేపో, ఎల్లుండో వచ్చేస్తాడు. నా బాబు త్వరగా లెక్చరర్ కావాలండీ!" నెమ్మదిగా అన్నది.

"సర్లే! అనసూయకు ఫోన్ చేసి వస్తాను!" అని లేచి వెళ్ళాడు మాధవరావు.

ఒక గంటలో అనసూయ పెద్దకోడల్ని వెంట బెట్టుకొని వచ్చింది.

చూస్తూ వుండగానే రుక్మిణికి జ్వరం పెరిగి పోయింది.

భయపడ్డాడు మాధవరావు. ఇద్దరు డాక్టర్లను వెంటబెట్టుకొచ్చాడు.

ఇద్దరూ రుక్మిణిని పరిశీలించి మందులు రాసి యిచ్చారు.

మర్నాడు మధ్యాహ్నందాకాకూడా రవి రాలేదు.

రుక్మిణికి కలవరింతలు ఎక్కువయ్యాయి.

"రవీ! బాగా చదువుకో!"

"ఈ అమ్మాయి చూడు....నీకు సరైన జోడు...."

"రవిచంద్రా! ఒక్కసారి అమ్మా అని పిలవరా!"

"మీ నాన్నగార్కి ఫోన్ చేసి చెప్పరా నీ రిజల్ట్సు వచ్చాయని...."

"ఈ రోజు నీ పుట్టిన రోజు రవీ! మనం గుడికెళ్ళాలి త్వరగా రా!"

"ఒక్కసారి మమ్మల్ని అమ్మా నాన్నా అనరా!"

"నా ఎదురుగా అమ్మా అని పిలవ్వా?"

"రవీ! నా దగ్గర సిగ్గు ఎందుకు? అమ్మా అమ్మా అని మళ్ళీ మళ్ళీ పిలవరా....!"

అవన్నీ విని ఏడుపు ఆగలేదు అనసూయకు.

పళ్ళ బిగువున దుఃఖాన్ని ఆపుకుంటున్నాడు మాధవరావు.

అక్కడ నిలబడలేక వీధిలోకి వచ్చి నుంచు న్నాడు ప్రకాశరావు.

తెలిసిన వాళ్ళు ఒక్కొక్కరే రుక్మిణిని చూడ టానికి రావటం మొదలు పెట్టారు.

అందరి గుండెల్లోనూ బండరాయి పడ్డట్లు చెప్పలేని బరువు.

ఏదైనా చెప్పాలన్నా గొంతుకేదో అడ్డం పడ్డట్లు మాట బయటికి రావటం లేదు. రవి కోసం క్షణక్షణానికి వీధిలోకి చూస్తున్నది వదినగారు.

డాక్టర్లు మందులు మార్చి మళ్ళీ రాశారు.

'ఈ రోజు గడుస్తే గండం గడిచినట్టే' అని చెప్పి డాక్టర్లు వెళ్ళిపోయారు.

క్షణమొక యుగంగానో అంతకంటే ఎక్కువ గానో వున్నది మాధవరావుకి.

అతను రుక్మిణి గురించి ఆలోచించసాగాడు.

పెళ్ళయిన దగ్గర్నుంచీ రుక్మిణికి మనశ్శాంతి కరువై పోయింది.

వివాహమయిన కొత్తలో అత్తగారి ఆధిక్యత నంతా రుక్మిణి మీద చూపించేది భారతమ్మ. ఆ తర్వాత పిల్లలు పుట్టలేదని ఎవరితోనో వంతు పెట్టి ఏదో విధాన దెప్పిపొడిచేది. ఆవిడ వున్న న్నాళ్ళూ ధైర్యం చెప్పినప్పుడు తప్ప పిరికిగా భయంగా వుండేది రుక్మిణికి. ఆ తర్వాత తల్లి కావాలన్న తహతహ, అమ్మా అని పిలిపించుకో వాలన్న ఆత్రంతో ఏరోజూ హాయిగా బ్రతకలేదు రుక్మిణి.

'అక్షరాలా అర్ధాంగిగా నా కష్టసుఖాల్లో పాలు పంచుకుంది. ఇన్నేళ్ళు నాతో కాపురం చేసి నా తోడునీడగా నిలచి ఇప్పుడు నన్ను ఒంటరివాణ్ణి చేసి వెళ్ళి పోతుందా?' నమ్మశక్యం కాలేదు అతనికి. ఏడుపు ఆగలేదు.

చెట్టంత మొగవాడు అలా వెక్కివెక్కి ఏడుస్తుంటే ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు అనసూయకి. పరుగున ప్రకాశరావును మాధవ రావు దగ్గరికి తీసుకెళ్ళింది.

*

రుక్మిణి కళ్ళు విప్పి చూసి మాధవరావుని దగ్గరకు పిలిచింది.

"రవి వచ్చాడా?" నూతి లోపల్నించి వచ్చి నట్లు సన్నగా అన్నది.

రాలేదన్నట్లు తలాడించాడు అతను.

"ఏమండీ! వాడు త్వరగా వచ్చి నన్ను అమ్మా అని పిలుస్తాడా?"

దుఃఖంతో గొంతు పూడుకుపోయింది మాధవ రావుకు. తలూపాడు.

"ఏమండీ! నేను వెళ్ళిపోతున్నందుకు బాధ పడుతున్నారా?"

మాట్లాడలేదు మాధవరావు.

ప్రియాతిప్రియమైనదాన్ని ఆఖరుసారి చూస్తు న్నట్లు పరీక్షగా రుక్మిణిని చూస్తూండి పోయాడు.

"జన్మజన్మలకు మీరే నా భర్త కావాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను."

చేతులు జోడించి నమస్కరించింది రుక్మిణి.

ఆ రెండు చేతులను ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నాడు మాధవరావు.

ఆ చేతులతోనే తన కన్నీటిని తుడుచుకున్నాడు.

ఆ క్షణంలోనే రవి ఇంట్లో అడుగుబెట్టాడు.

అందరూ ఆందోళనగా రుక్మిణి మంచం చుట్టూ చేరారు.

అడుగు ముందుకు వెయ్యలేక అయోమయంగా అక్కడే నిలబడిపోయాడు రవి.

రుక్మిణి కళ్ళు గిరగిరా తిరుగుతూనే వున్నాయి రవిని చూడాలని.

ఆమె గుండె ఇంకా కొట్టుకుంటూనే వుంది–అమ్మా అని పిలిపించుకోవాలని.

ఒక్క అడుగులో మంచం దగ్గరకు వచ్చాడు రవి అందర్నీ తోసుకుంటూ.

ఎదురుగా రుక్మిణి ముఖమంతా నవ్వు చేసుకొని చూస్తున్నది.

'వచ్చావా నాయనా!' అన్నట్లు కదిలాయి ఆమె పెదవులు.

ఆ కళ్ళు అనురాగాన్ని కురిపిస్తున్నాయి.

'అమ్మా....అమ్మా...' లోపల పదేపదే అనుకున్నాడు రవి.

"అమ్మా! అని గట్టిగా పిలు రవీ! త్వరగా పిలు. ఆలస్యమైతే నిన్ను నువ్వు క్షమించుకోలేవు. తొందరగా పిలు. అమ్మా అను...." హెచ్చరిస్తూ తొందరపెట్టింది వదినగారు.

చూస్తూ వుండగానే రుక్మిణి ముఖంలో కాంతి తగ్గిపోయింది.

"అమ్మా!" గట్టిగా పిలిచాడు రవి....కాదు అరిచాడు. అతి ప్రయత్నం మీద నోరు పెగుల్చుకొని.

రుక్మిణి శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోయింది.

మాధవరావు చేతుల్లోంచి రుక్మిణి చేతులు జారిపోయాయి.

" 'అమ్మా' అని పిలిపించుకున్నానని తృప్తి కలిగింది కాబోలు. నవ్వుతూ వెళ్ళిపోయింది." పక్కింటావిడ కళ్ళు తుడుచుకుంది.

"ఆవిడ బ్రతుక్కి నవ్వేక్కడిదమ్మా? ఉన్నన్నాళ్ళూ అమ్మా అని పిలిపించుకోవాలనే తహతహలాడింది. ఆవిడ కోరిక తీరిందా? ఏమన్నానా? వెళ్ళిపోవటమే అదృష్టం లే!" ఎదురింటావిడ అన్నది.

"ఇన్నేళ్ళు పెంచారు. ఇంత చేశారు. ఒక్కరోజైనా అమ్మా అని నోటంట రానిచ్చాడా? ఛ! ఎందుకొచ్చిన చదువులు?" మరో ఇంటావిడ అందుకున్నది.

-"లేదులేవమ్మా! ఇప్పుడు రాగానే పిలిచాడు. రుక్మిణమ్మ అది విన్నది. సంతోషంగా పసుపు కుంకుమలతో వెళ్ళిపోయింది. ఆడబ్రతుక్కి అంతకంటె ఏం కావాలి?" తల మీదకి గుడ్డ లాక్కుంటూ అన్నదొక బామ్మగారు.

రుక్మిణి ముఖంలోకి పరీక్షగా చూశాడు రవి. 'నవ్వుతున్నది....అమ్మ నేను పిలిచిన పిలుపు విన్నది. అందుకే ఆశీర్వదిస్తున్నది!' తనలో తను అనుకున్నాడు రవి. అతనికి కొంచెం తృప్తిగా వున్నది. 'ఆఖరుసారిగా అమ్మా అని పిలిచాను. అమ్మ ఆత్మ శాంతిస్తుంది' అనుకున్నాడు.

"లేదండీ బామ్మగారూ! మీరు సరిగ్గా చూడలేదు. ఆయన చేతుల్లో ఆవిడ చేతులు వుండగానే పిలవలేదు. అవి జారిపోయాక, ఆ వదినగారు వెనకనించి పిలూ, పిలూ అంటుంటే అప్పుడు కదూ అమ్మా అన్నాడు ఈ దొరగారు. అప్పటికావిడ ప్రాణం పోనే పోయింది. ఆ మాట రుక్మిణమ్మగారు ఎక్కడ విన్నదీ?" ఇరుగింటావిడ బామ్మగారి మాటలను కొట్టి పారేసింది.

"అవును....నిజమే! ఆవిడ చెవుల్లో అమ్మా అన్న పిలుపే పడలేదు. ఆవిడది వినలేదు!" ఇరుగూ పొరుగూ అందరూ ఏకంగా తీర్మానించారు.

ఆ మాటలు విన్న రవిచంద్ర ముఖం పాలిపోయింది.

ఆత్మీయులందరి మనసుల్లోనూ ఒకటే ప్రశ్న సుళ్ళు తిరుగుతున్నది.

'అమ్మా!' అన్న కమ్మని పిలుపు రుక్మిణికి చేరలేదా?

అమ్మను కావాలని ఆశపడి, అమ్మగా ఆ పిలుపు అందుకోకుండానే వెళ్ళిపోయిందా? దీనికి జవాబెవరు చెప్తారు?

సమాధానం తెల్సిన రుక్మిణి మాట్లాడటం లేదు.

నిజమేదో కనుక్కొని లోకానికి చాటి చెప్దామంటే....తనవెంట ఎవరూ రావటానికి ఇష్టపడదు రుక్మిణి. ఏం చెయ్యాలి? సమాధానం ఎలా తెలుస్తుంది?

ఆ పరిస్థితికి తట్టుకోలేక అందరూ అమిత దుఃఖంతో రుక్మిణినే చూస్తూ నిలబడ్డారు.

"నాన్నా! నన్ను క్షమించండి. నేను పరమ నీచుణ్ణి. దేవుడైనా నన్ను క్షమించడు." వెక్కివెక్కి ఏడుస్తూ మాధవరావు ఒళ్ళో తల పెట్టుకున్నాడు రవి.

"అమ్మకి పిల్లలమీద వుండేది ప్రేమే నాయనా! అమ్మ క్షమించింది. దేవుడు కూడా క్షమిస్తాడు!" రవి తలని చేత్తో నిమురుతూ, తన దేవతని చూస్తూ అన్నాడు మాధవరావు.

రుక్మిణి ప్రశాంతంగా నిద్రపోతున్నది.

[సమాప్తం]


కొత్తది!

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్ఠమైన

# ఆముదము

శుద్ధిచేసినది.
వాసనలేనిది.




మూడు సైజులలో లభిస్తుంది:
50 మి.లి
100 మి.లి
200 మి.లి

అమృతాంజన్ ఆముదము

OBM 3270 5 TG(R)





Edited & Published by B. Viswanatha Re[illegible] for CHANDAMAMA CHILDREN'S TRUST FUND (Prop.